




RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక








ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 166 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | గురువారం 06 - ఆగస్టు - 2026 | వెల రూ. 5 /-


# తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపుపై సీఆర్ పాటిల్‌తో రేవంత్ రెడ్డి భేటీ





- మహారాష్ట్రను ఒప్పించి 150-152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని సీఆర్ పాటిల్‌కు సీఎం విజ్ఞప్తి.
- బ్యారేజీ ఎత్తు పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని CWPRS అధ్యయన నివేదిక ఆధారంగా స్పష్టం చేసిన సీఎం.
- గ్రావిటీ ద్వారా నీటి సరఫరాతో విద్యుత్ భారం తగ్గి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు అందుతుందని వెల్లడి.
- సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల అధికారులతో త్వరలోనే చర్చలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్.

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణాన్ని 150 నుంచి 152 మీటర్ల ఎత్తుతో చేపట్టేలా మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఉన్నతాధికారులతో కలిసి జల్‌శక్తి మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రితో సమావేశమైన సీఎం, ఈ మేరకు వినతిపత్రం అందించారు.....

2

# నిరసనల్లో పాల్గొనే యువత పట్ల అత్యంత సహనంతో వ్యవహరించాలి : సుప్రీంకోర్టు

- హింసను అదుపు చేసే క్రమంలో బలగాలు జాగ్రత్తగా ఉండాలన్న సుప్రీంకోర్టు
- యువత ఎదురు దాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాద- ముందని హెచ్చరిక
- యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని వ్యాఖ్య



**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి ఆందోళనలు, వాటి సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల్లో పాల్గొంటున్న విద్యార్థుల పట్ల అధికారులు అత్యంత విచక్షణతో, సహనంతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. హింసను అదుపు చేసే నెపంతో భద్రతా బలగాలు కూడా అంతే తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు బీహార్, రాజస్థాన్ ...

2

# సమ్మక్క-సారక్క ప్రాజెక్టుపై చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారా..? - హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు

- సమ్మక్క సాగర్ నీళ్లను ఏపీకి ధారాదత్తం చేసేందుకు రేవంత్ సర్కార్ సిద్ధపడిందన్న హరీశ్
- దీనిపై రేవంత్ నోరు విప్పాలని డిమాండ్
- తెలంగాణ ప్రజల నోటికాడి ముద్దను లాక్కునేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మండిపాటు



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** కర్ణాటకలో జరిగిన ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ అనంతరం సమ్మక్క-సారక్క (సమ్మక్క సాగర్) ప్రాజెక్టుకు చెందిన తెలంగాణ వాటా నీళ్లను ఆంధ్రప్రదేశ్‌కు దారాదత్తం చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధపడిందంటూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, తెలంగాణ ప్రజలకు సంబంధించిన అత్యంత కీలకమైన...

2

# తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్.. డయల్ 112తో అన్ని సేవలు

- ఒకే నంబర్‌తో పోలీస్, అంబులెన్స్, ఫైర్ సేవలు
- హైదరాబాద్‌లో కొత్త కాల్ సెంటర్‌ను ప్రారంభించిన డీజీపీ
- కాలర్ లొకేషన్‌ను గుర్తించి వెంటనే ఆయా సేవలకు సమాచారం
- సమీప బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకునేలా చర్యలు
- ఏడాది పొడవునా 24 గంటలు 112 సేవలు అందుబాటులో
- అత్యవసర సేవల్లో ఏఐ వినియోగాన్ని పెంచనున్నట్లు డీజీపీ వెల్లడి



2

# హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ..! 8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు..!

- నకిలీ ఎన్‌ఓసీ పత్రాలను తయారు చేసిన ముఠా గుట్టు రట్టు
- ఇంటర్ బోర్డు అనుమతుల కోసం దొంగ సంతకాలతో నకిలీ ఎన్‌ఓసీలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' పేరును వాడుకుని కొందరు అక్రమాలకు యత్నించిన తీరు తీవ్ర కలకలం రేపుతోంది. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ 'ఫైర్ ఎన్‌ఓసీ' (NOC) పత్రాలను తయారు చేసిన ఒక ముఠా గుట్టు రట్టయింది. ఏకంగా నగరంలోని 8 ప్రముఖ ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈ నకిలీ సర్టిఫికెట్ల ఆధారంగా గుర్తింపు పొందేందుకు యత్నించడం విద్యాశాఖతో పాటు పోలీసు వర్గాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. హైడ్రా కార్యాలయం నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే, కమిషనర్ పేరు మీద దొంగ సంతకాలతో ఫేక్ ఎన్‌ఓసీలు సృష్టించారు. ఇంటర్మీడియట్...

2



# హోర్ముజ్ జలసంధి భవిష్యత్తుపై కొనసాగుతున్న అనిశ్చితి

- ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయన్న ట్రంప్
- అమెరికాతో చర్చలు జరగడం లేదంటూ ఇరాన్ ఖండన
- ఒమన్‌తో మాత్రమే సంప్రదింపులు కొనసాగుతున్నాయని స్పష్టీకరణ
- ట్రూత్ సోషల్‌లో ఇరాన్‌పై ట్రంప్ విమర్శలు

2



**నేటి శుభోదయ, డెస్క్ :** హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఈ అంశంపై ఇరాన్‌తో చర్చలు సాగుతున్నాయని తెలిపారు. అయితే ఇరాన్ మాత్రం అమెరికాతో ఎలాంటి చర్చలు జరగడం లేదని స్పష్టం చేసింది. దీంతో ఇరు దేశాల ప్రకటనలు పరస్పర విరుద్ధంగా మారాయి......

# దిగొచ్చిన మెటా..

## భారత్‌కు క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

- భారత ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పిన మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్
- డీప్‌ఫేక్‌లు, అభ్యంతరకర కంటెంట్ వ్యాప్తిపై చింతిస్తున్నట్లు వెల్లడి
- ప్రధాని మోదీ పోస్ట్ తొలగింపు వ్యవహారంలో కీలక పరిణామం
- తప్పులు జరిగాయని అంగీకారం, సేఫ్ హార్బర్ రక్షణపై కేంద్రం హెచ్చరిక
- ఢిల్లీలో ఐటీ కార్యదర్శితో మెటా ప్రతినిధుల ఉన్నత స్థాయి సమావేశం

2



# యూపీఐ చెల్లింపుల వ్యవస్థలో భారీ మార్పు..

- యూపీఐ లావాదేవీలపై ఛార్జీల విధింపునకు కేంద్రం కసరత్తు
- రూ.2,000కు మించిన చెల్లింపులపై రుసుము ప్రతిపాదన
- ఛార్జీల భారం వ్యాపారులపైనే, వినియోగదారులపై కాదు
- డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ బలోపేతమే లక్ష్యమంటున్న ప్రభుత్వం

UPI
UNIFIED PAYMENTS INTERFACE

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి నాంది పలికిన యూపీఐ సేవలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రూ.2,000కు మించిన విలువైన యూపీఐ లావాదేవీలపై సర్వీస్ ఛార్జీలు (ఎండీఆర్) విధించేందుకు వీలు కల్పిస్తూ పార్లమెంటులో ఓ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో 'పేమెంట్ అండ్ .....

2

# 2028 నాటికి పాలిమర్ నోట్లు తీసుకురావడమే లక్ష్యం: ఆర్‌బీఐ

- ప్రస్తుతం క్షేత్రస్థాయి పరీక్షలు కొనసాగుతున్నాయని వెల్లడి
- రూ.10, రూ.20 నోట్లతో పైలట్ ప్రాజెక్టు
- పూర్తిగా పరిశీలించిన తర్వాతే మార్కెట్లోకి తీసుకొస్తామన్న గవర్నర్
- పాలిమర్ నోట్లు ఎక్కువకాలం మన్నుతాయన్న ఆర్‌బీఐ



2

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** భారత్‌లో పాలిమర్ కరెన్సీ నోట్లను 2028 ఆర్థిక సంవత్సరం నాటికి చలామణిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ప్రస్తుతం పాలిమర్ నోట్లపై క్షేత్రస్థాయి పరీక్షలు కొనసాగుతున్నాయని చెప్పారు. ద్రవ్య విధాన సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడిన మల్హోత్రా.. మార్కెట్‌లోకి తీసుకొచ్చే ముందు పాలిమర్ నోట్ల పనితీరును పూర్తిగా పరిశీలిస్తామని వెల్లడించారు. ఫలితాలను విశ్లేషించిన తర్వాతే విస్తృత స్థాయిలో చలామణిపై తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల రూ.10, రూ.20 విలువైన పాలిమర్ నోట్ల క్షేత్రస్థాయి పరీక్షలకు ఆర్‌బీఐ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఒక్కో విలువలో 100 కోట్ల నోట్లు విడుదల చేసి వాటి మన్నిక, భారత వాతావరణ పరిస్థితులకు అనుకూలతను పరిశీలించనున్నారు. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువకాలం మన్నుతాయని ఆర్‌బీఐ పేర్కొంది. వీటిలో పారదర్శక విండోలు, అధునాతన భద్రతా ఫీచర్లు ఉండటంతో నకిలీ నోట్లను అరికట్టడంలో కూడా ఉపయోగపడతాయని తెలిపింది. అయితే ప్రస్తుతం కాగితపు నోట్లను పూర్తిగా తొలగించే ప్రతిపాదన లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పాలిమర్ నోట్లు ప్రవేశపెడితే అవి ప్రస్తుతం ఉన్న కాగితపు నోట్లతో పాటు చలామణిలో కొనసాగనున్నాయి.

## తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపుపై సీఆర్ పాటిల్‌తో రేవంత్ రెడ్డి భేటీ

**మొదటిపేజీ తరువాయి..** గతంలో 148 మీటర్ల ఎత్తుతో ఒప్పందం కుదిరినప్పటికీ, గ్రావిటీ ద్వారా నీటిని తరలించాలంటే ఎత్తును 150 నుంచి 152 మీటర్లకు పెంచాల్సి ఉంటుందని, దీనివల్ల విద్యుత్ వినియోగ భారం తగ్గడమే కాకుండా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందని వివరించారు. పుణెలోని CWPRS నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఎత్తు పెంచినా ముంపు ప్రభావంలో పెద్దగా తేడా ఉండదని, ముంపులో 50 శాతం నదీ గర్భంలోనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతపై తాను ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖ ఆధారంగా సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని కోరగా, మొదట కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో అధికారుల స్థాయి చర్చలు జరిపి, అనంతరం ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ హామీ ఇచ్చారు.

## తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్.. డయల్ 112తో అన్ని సేవలు

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలో అత్యవసర సేవల కోసం ఇకపై ఒకే నంబర్ అందుబాటులో ఉంటుంది. ఇప్పటి వరకు పోలీసులకు 100, అంబులెన్స్, అగ్నిమాపక సేవలకు వేర్వేరు నంబర్లను ఉపయోగించగా, ఇక నుంచి వాటన్నింటికీ డయల్ 112 అమల్లోకి వచ్చింది. హైదరాబాద్‌లో కొత్త ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. కొత్త విధానంతో పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక సహా ఇతర అత్యవసర సేవలు ఒకే వేదికపైకి వస్తాయి. రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు, గొడవలు, మహిళలపై వేధింపుల వంటి అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే వెంటనే స్పందన లభించేలా వ్యవస్థను రూపొందించినట్లు డీజీపీ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కాల్స్‌ను పర్యవేక్షిస్తారు. 112కు ఫోన్ వచ్చిన వెంటనే కాలర్ వివరాలు, లొకేషన్‌ను గుర్తించి సమీప పోలీస్ స్టేషన్, అగ్నిమాపక సిబ్బంది, అవసరమైన బృందాలకు సమాచారం పంపిస్తారు. దీంతో సహాయక చర్యలు మరింత వేగంగా ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. డయల్ 112 సేవలు రోజుకు 24 గంటలు, ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత విస్తృతంగా వినియోగించి అత్యవసర సేవల సామర్థ్యాన్ని పెంచాలని తెలంగాణ పోలీస్ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీజీపీ వెల్లడించారు.

## నిరసనల్లో పాల్గొనే యువత పట్ల అత్యంత సహనంతో వ్యవహరించాలి : సుప్రీంకోర్టు

**మొదటిపేజీ తరువాయి..** పశ్చిమ బెంగాల్‌లలో సీజేపీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయని, జులై 20 నాటి నిరసనల్లో రాళ్లదాడి, హింస కారణంగా సార్వజనిక ఆస్తులకు జరిగిన నష్టానికి ఆ సంస్థనే బాధ్యులను చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కొత్త అర్జీని కూడా ఢిల్లీ తదితర ప్రాంతాల్లోని విద్యార్థి ఆందోళనలకు సంబంధించిన ప్రధాన కేసులతో సుప్రీంకోర్టు జతచేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత ప్రదర్శనల సమయంలో పోలీసులు అత్యంత సంయమనం పాటించాలని సూచించిన సీజేఐ... యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని పేర్కొన్నారు. యువకులు అసలు ఏం కోరుకుంటున్నారు, వారి ఆవేదనకు కారణమేంటో ఓపికగా వినడమే అన్ని సమస్యలకు అత్యంత శక్తివంతమైన పరిష్కారమని వ్యాఖ్యానించారు. అయితే శాంతిభద్రతలను కాపాడే క్రమంలో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల విచక్షణపై తమకు నమ్మకం ఉందని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నివేదికలను పరిశీలించిన పిమ్మటే ఈ విషయంలో తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు ధర్మాసనం తెలిపింది.

## హార్ముజ్ జలసంధి భవిష్యత్తుపై కొనసాగుతున్న అనిశ్చితి

**మొదటిపేజీ తరువాయి..** ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. హార్ముజ్ జలసంధి అంశంలో త్వరలోనే నిర్ణయం వస్తుందని చెప్పారు. "జలసంధిని వెంటనే తెరవాలి. ఒకటి రెండు రోజుల్లోనే పరిణామాలు స్పష్టమవుతాయి. లేకపోతే ఇరాన్ తీవ్ర మూల్యం చెల్లించాల్సి ఉంటుంది" అని వ్యాఖ్యానించారు. అంతకుముందు వైట్ హౌస్‌లో కూడా ట్రంప్ ఇదే అంశంపై మాట్లాడారు. ఇరాన్‌కు ఇది చివరి అవకాశం అని పేర్కొన్నారు. హార్ముజ్ జలసంధిని తెరవడంపై చర్చలు చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ వెంటనే ఖండించింది. ప్రస్తుతం అమెరికాతో ఎలాంటి చర్చలు జరపడం లేదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తెలిపారు. విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి మినహా చర్చల బృందంలోని సభ్యులంతా ఇరాన్‌లోనే ఉన్నారని వెల్లడించారు. దీనిపై ట్రంప్ సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో స్పందించారు. సమావేశం కావాలని కోరుతూ, మరోవైపు చర్చలు లేవని చెప్పడం ఇరాన్ నాయకత్వం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. అయితే ఒమన్‌తో మాత్రం సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఇరాన్ వెల్లడించింది. హార్ముజ్ జలసంధిలో సముద్ర రవాణా భద్రత కోసం తాత్కాలిక ఏర్పాట్లపై చర్చలు జరుగుతున్నాయని తెలిపింది. ఈ చర్చల్లో మరే ఇతర దేశం భాగస్వామి కాదని స్పష్టం చేసింది.

## హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ..! 8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు..!

**మొదటిపేజీ తరువాయి..** బోర్డు నుంచి అఫిలియేషన్ (అనుమతులు) సాధించడం కోసం సదరు ప్రైవేటు కాలేజీలు ఈ నకిలీ పత్రాలను సమర్పించాయి. అయితే బోర్డు అధికారులు, హైడ్రా యంత్రాంగం డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు ఆ సర్టిఫికెట్లు నకిలీవని, వారి సంతకాలు ఫోర్జరీకి గురయ్యాయని తేలింది. ఈ దారుణ అక్రమంపై స్పందించిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు.. మోసానికి పాల్పడిన 8 కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ లేక్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు.

## సమ్మక్క-సారక్క ప్రాజెక్టుపై చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారా..? - హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి..** నీటి హక్కులపై కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం వహించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటకలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంల సమావేశం, తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవం తర్వాత సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి మన రాష్ట్రానికి చెందిన 47 టీఎంసీల వాటాను ఏపీ కోసం వదులుకోవడానికి సిద్ధపడ్డారనే వార్తలు నెట్టింట వ్యాపిస్తున్నాయనీ... దీనిపై సీఎం రేవంత్ రెడ్డి నోరు విప్పాలని డిమాండ్ చేశారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు అజెండాలో సమ్మక్క సాగర్‌కు 47 టీఎంసీలు కేటాయించే ప్రసక్తే లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసినా, ఈ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కనీసం స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు. తమ కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే సమ్మక్క సాగర్ 47 టీఎంసీల ప్రాజెక్టుకు అవసరమైన అన్ని రకాల కేంద్ర అనుమతులు తీసుకొచ్చామని హరీశ్ రావు గుర్తుచేశారు. ఆఖరికి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గానికి కూడా ఫలాలను అందించే ఈ నీటి కేటాయింపులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా వదులుకుంటుందని ప్రశ్నించారు. చంద్రబాబు మళ్లీ తెలంగాణ ప్రజల నోటికాడి ముద్దను లాక్కునేందుకు కుట్రలు పన్నుతున్నారనీ, తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకునేలా కేంద్రానికి లేఖలు రాయడమే కాకుండా బోర్డు సమావేశాల్లో పాత అనుమతులను రద్దు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణకు నీటి విషయంలో అన్యాయం జరిగితే సహించేది లేదని, జాగ్రత్తగా ఉండాలని చంద్రబాబును ఈ సందర్భంగా హెచ్చరించారు.

## యూపీఐ చెల్లింపుల వ్యవస్థలో భారీ మార్పు..

**మొదటిపేజీ తరువాయి..** సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007'కు ఈ సవరణను ప్రతిపాదించారు. అయితే, ఈ ప్రతిపాదనతో సామాన్య వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలుస్తోంది. వ్యక్తుల మధ్య జరిగే నగదు బదిలీలు (పీ2పీ), చిన్న వ్యాపారులకు చేసే రోజువారీ చెల్లింపులపై ఎలాంటి రుసుములు ఉండబోవని నిపుణులు చెబుతున్నారు. ఈ కొత్త ఛార్జీలను వ్యాపారులే భరించాల్సి ఉంటుంది తప్ప, వినియోగదారులపై నేరుగా భారం మోపే అవకాశం లేదు. ఏడాదికి రూ.1.5 కోట్లకు పైగా టర్నోవర్ కలిగిన బడా వ్యాపార సంస్థలకు అందే రూ.2,000కు మించిన చెల్లింపులపై మాత్రమే 0.3 శాతం నుంచి 0.5 శాతం వరకు మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వర్తిస్తుంది. 2020 జనవరిలో యూపీఐ లావాదేవీలపై కేంద్రం 'జీరో ఎండీఆర్' విధానాన్ని అమలులోకి తెచ్చింది. దీనివల్ల బ్యాంకులు, ఫోన్‌పే, గూగుల్‌పే వంటి పేమెంట్ సంస్థలకు ఆదాయం పూర్తిగా నిలిచిపోయింది. నెట్‌వర్క్ నిర్వహణ, సాంకేతిక అభివృద్ధి, సైబర్ భద్రతకు అవసరమైన పెట్టుబడులు పెట్టడం వాటికి భారంగా మారింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో రూ.2,000 కు పైబడిన యూపీఐ లావాదేవీల వాటా సంఖ్యాపరంగా 4–5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, విలువ పరంగా మాత్రం 65 శాతం వరకు ఉంది. అందువల్ల, పెద్ద వ్యాపారులపై ఈ నామమాత్రపు రుసుము విధిస్తే ఏటా రూ.5,000 కోట్ల ఆదాయం సమకూరి, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రస్తుతానికి ఇది పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు మాత్రమేనని, దీని అమలు తేదీ, తుది ఛార్జీల శాతంపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉందని అధికారులు తెలిపారు.

## దిగొచ్చిన మెటా.. భారత్‌కు క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

**మొదటిపేజీ తరువాయి..**
ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపారు. ప్రధాని మోదీ వీడియో తొలగింపు, తమ ప్లాట్‌ఫామ్‌లపై చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తి చెందడంపై ఆయన చింతిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు, తమ ప్లాట్‌ఫామ్‌ల నిర్వహణలో జరిగిన లోపాలను కూడా అంగీకరిస్తూ ఆయన విచారం వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీకి చెందిన ఓ ఫేస్‌బుక్ పోస్ట్‌ను కొద్దిసేపు తొలగించడంపై పార్లమెంటరీ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ వివాదంపై చర్చించేందుకు మెటా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీలో ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా, అభ్యంతరకర, తప్పుడు కంటెంట్ వ్యాప్తిపై భారత ప్రభుత్వం లేవనెత్తిన ఆందోళనలను మెటా ప్రతినిధులు అంగీకరించారని, ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లపై జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. యూజర్లకు ఏ కంటెంట్ చేరాలనేది ప్లాట్‌ఫామ్‌లే ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నప్పుడు, వాటిని కేవలం మధ్యవర్తులుగా పరిగణించలేమని భారత అధికారులు మెటాకు స్పష్టం చేసినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఐటీ చట్టం కింద లభించే 'సేఫ్ హార్బర్' రక్షణ వర్తించదని తేల్చిచెప్పారు. కొన్ని రకాల కంటెంట్‌ను ప్రోత్సహించేందుకు (బూస్టింగ్) భారీగా డబ్బులు చెల్లించినట్లు మెటా అంగీకరించిందని, ఈ తప్పులకు విచారం వ్యక్తం చేసిందని కూడా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రధాని మోదీ పోస్ట్ తొలగింపుపై మూడు రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పార్లమెంటరీ ప్యానెల్ మెటాను ఆదేశించింది. గడువులోగా స్పందించకపోతే మెటా 'సేఫ్ హార్బర్' రక్షణను కోల్పోతుందని ఐటీ మంత్రిత్వ శాఖ వర్గాలు హెచ్చరించాయి. ఈ పరిణామాల మధ్య మెటా ప్రతినిధులు ఐటీ కార్యదర్శితో భేటీ కావడం, కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కూడా సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఏఐతో భయపడొద్దు.. భారత్‌కు లాభాలే ఎక్కువ : ప్రపంచ బ్యాంకు

**నేటి శుభోదయ, డెస్క్ :** కృత్రిమ మేధ (ఏఐ) వల్ల ఉద్యోగాలు పోతాయన్న ఆందోళనల మధ్య ప్రపంచ బ్యాంకు ఆసక్తికర నివేదిక విడుదల చేసింది. భారత్‌లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఏఐ ఉద్యోగాలను భర్తీ చేయడం కంటే, ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని వెల్లడించింది. సరైన చర్యలు తీసుకుంటే శతాబ్దం పట్టే అభివృద్ధిని పదేళ్లలోనే సాధించే అవకాశం ఉందని పేర్కొంది. ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం.. అధిక ఆదాయ దేశాల్లో ప్రస్తుతం ఉన్న ఉద్యోగాల్లో 14.2 శాతం ఏఐ ఆటోమేషన్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉంది. తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లో మాత్రం ఈ ముప్పు 4.5 శాతమే. అదే సమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 16.2 శాతం ఉద్యోగాల్లో ఏఐ వల్ల ఉత్పాదకత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సంఖ్య 18.7 శాతంగా ఉంది. భారీ ఏఐ మోడళ్లు, ఖరీదైన డేటా సెంటర్ల నిర్మాణం




కంటే స్థానిక అవసరాలకు అనుగుణంగా తక్కువ ఖర్చుతో పనిచేసే ఏఐ వ్యవస్థలను వినియోగిస్తే భారత్‌కు ఎక్కువ ప్రయోజనం ఉంటుందని ప్రపంచ బ్యాంకు సూచించింది. విద్య, వైద్యం, వ్యవసాయం, న్యాయ సేవలు, ప్రభుత్వ సేవల్లో ఏఐ కీలక మార్పులు తీసుకురాగలదని అభిప్రాయపడింది. ఇప్పటికే భారత్‌తో పాటు కెన్యా, మెక్సికో, నైజీరియా, థాయ్‌లాండ్‌లో ఐదుగురికి పైగా ఉద్యోగులు ఉన్న సంస్థల్లో ఐదింటిలో ఒకటి ఏఐ చాట్‌బాట్‌లను వినియోగిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. అయితే విద్యుత్, ఇంటర్నెట్, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నాణ్యమైన డేటా, బలమైన వ్యవస్థలు లేకపోతే ఏఐ ప్రయోజనాలు పూర్తిగా అందవని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. దశలవారీగా ఏఐను అమలు చేయాలని, గోప్యతకు రక్షణ కల్పిస్తూ బాధ్యతాయుత వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించింది.

## తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు "సురక్షా కా తిరంగా" జాతీయ సైబర్ జాగ్రూకత అవగాహన కార్యక్రమాలు

- సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన "సురక్షా కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పీ.
- సైబర్ నేరాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండండి. అత్యాశకు లోనై సైబర్ మోసాలకు గురికావద్దు – అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్.






**సంగారెడ్డి, ఆగస్టు 05, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్, ఐపీఎస్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) డైరెక్టర్ షికా గోయల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నెలరోజుల పాటు "సురక్షా కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ" పేరుతో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ తెలిపారు. ఆగస్టు నెల తొలి బుధవారం నిర్వహించే జాతీయ సైబర్ జాగ్రూకత దివస్ సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని సెయింట్ ఆంథోనీ డిగ్రీ కళాశాలలో నిర్వహించన "సురక్షా కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ" సైబర్ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో సైబర్ నేరాలు ఒకటని అన్నారు. సైబర్ నేరాలకు గురవుతున్న వారిలో విద్యావంతులే అధికంగా ఉండటం ఆందోళనకర విషయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్క సంవత్సరంలోనే సైబర్ మోసాల కారణంగా సుమారు రూ.1,300 కోట్ల మేర ప్రజలు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు.తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో తెలియని వ్యక్తులు పంపే లింకులను ఓపెన్ చేయడం, నకిలీ పెట్టుబడి (స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్) ఆఫర్లు, వ్యాపార పెట్టుబడి పేరుతో వచ్చే మోసపూరిత సందేశాలను నమ్మడం వల్ల సైబర్ మోసాలకు గురవుతున్నారని చెప్పారు. సైబర్ నేరాలను నియంత్రించడంలో అప్రమత్తతే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు.తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. విద్యార్థులందరూ "సైబర్ అంబాసిడర్లుగా" వ్యవహరించి, తమ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితుల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు."సురక్షా కా తిరంగా" సందేశంలోని మూడు రంగులు ప్రజలకు సైబర్ భద్రతపై మూడు ముఖ్యమైన సూచనలను అందిస్తున్నాయని అన్నారు. కాషాయం– అప్రమత్తంగా ఉండండి: సైబర్ మోసాలు, అనుమానాస్పద ఆన్‌లైన్ ఆఫర్ల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. తెలుపు– అవగాహన పెంచుకోండి.: సైబర్ భద్రతపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుత డిజిటల్ లావాదేవీలు చేయండి. ఆకుపచ్చ– సురక్షితంగా ఉండండి: సురక్షితమైన సైబర్ విధానాలను పాటించి, డిజిటల్ భద్రతను కాపాడుకోవాలి. ఆగస్టు నెల మొత్తం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పరిశ్రమలు తదితర ప్రాంతాల్లో డిజిటల్ అరెస్ట్, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు మరియు ఇతర ఆన్‌లైన్ ఆర్థిక నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు.అనంతరం సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, డిజిటల్ అరెస్ట్, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు తదితర సైబర్ నేరాలపై షార్ట్ వీడియో ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా ఆర్థిక నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుందని వివరించారు. సైబర్ నేరాలపై అవగాహనే వాటి నివారణకు అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని తెలిపారు.ఈ కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, చైర్మన్ డా. సాల్మన్ రెడ్డి, డిగ్రీ కళాశాల డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ రామునాయుడు, సైబర్ సెల్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ హెచ్ఆర్సీఐ జనరల్ సెక్రెటరీగా ఎం బాబురావు నియామకం





**ఖమ్మం, ఆగస్టు 05 ,నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర హెచ్ఆర్సీఐ జనరల్ సెక్రెటరీగా డాక్టర్ ఎం బాబురావు ను నియమించినట్లు సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు సింగమాల వెంకట రమణయ్య బుధవారం వెల్లడించారు. గతంలో హెచ్ఆర్సీఐ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బాధ్యతల్లో ఉన్న బాబురావును జనరల్ సెక్రెటరీగా నియమించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పగించిన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు సింగమాల వెంకటరమణయ్య, తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కిషోర్ కుమార్, వర్కింగ్ చైర్మన్ బెస్త సంజీవరావు తో పాటు డైరెక్టర్స్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణ సంస్థ కోసం తన శక్తి మేర కృషి చేస్తానని బాధితులకు అండగా నిలిచి వారికి న్యాయం జరిగేలా నిరంతరము పనిచేస్తానని పేర్కొన్నారు. అలాగే సంస్థ అభివృద్ధికి అంకిత భావంతో సేవలందిస్తూ ఎక్కడైనా మానవ హక్కుల కు ఉల్లంగనలు జరిగి నప్పుడు తెలంగాణ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ వారి తరఫున గట్టిగా స్పందించి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 33 జిల్లాలలో సంస్థ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ నియామకం తనపై మరింత సామాజిక బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టుగా, సమాజంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజానికి తమకు ఉన్నటువంటి అవకాశం మేరా ఏదో చేయాలనే తపనతో ఇటువంటి సంస్థలో పనిచేసే ఉత్సాహం ఉండటంతో హెచ్ఆర్సీఐ సంస్థ తమకు ఎంత అవకాశం కల్పించడం తమక అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. సహకరించినటువంటి రాష్ట్ర కమిటీ బృందానికి, జిల్లా కమిటీ బృందానికి ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం బాబురావుకు పలువురు దుస్సాల్వాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా జీవితంలో ఒక భాగంగా ప్రకాశించిన పోస్టాఫీస్

### -అంకితభావానికి మారుపేరు తపాలా కార్యాలయం

**ఖమ్మం,ఆగస్టు 05 , నేటి శుభోదయ :** ఎన్నో దశాబ్దాల పాటు పట్టణ గ్రామీణ ప్రాంతాలలో విశేష సేవలు అందించి జీవితంలో ఒక భాగంగా ప్రకాశించిన పోస్టాఫీస్ సేవలు ఎప్పటికీ మరువలేనివని సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వి సూర్యనారాయణ పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం పోస్టాఫీస్ ప్రజల జీవితంలో ఒక భాగంగా ఉండేదని, ఇది అందించే సేవలపై అందరూ ఆధారపడేవారని పేర్కొంటూ చిన్నప్పటి నుండి పోస్టాఫీస్ తో తనకు గల అనుబంధాన్ని, ఈ కార్యాలయ విశిష్టతను ఆయన " నేటి శుభోదయ " కి తెలియజేశారు. ఎక్కడికైనా ఒక లేఖను వ్రాయాలన్నా, ఎవరికైనా అత్యవసర సమాచారాన్ని టెలిగ్రామ్ ద్వారా పంపాలన్నా, దూర ప్రాంతాలకు ఫోన్ చేయాలన్నా ప్రజలకు పోస్టాఫీసు ముఖ్య ఆధారంగా ఉండేది. పోస్టల్ సిబ్బంది ప్రజలకు ఎంతో సహకరించేవారు. పోస్ట్ బాక్స్ లో ఉత్తరం వేయడం పిల్లలకు ఎంతో సరదాగా ఉండేది. అప్పట్లో పోస్ట్ ఆఫీస్కు వెళ్లడం ఒక చక్కని అనుభూతి. సామాన్యులకు పోస్ట్ కార్డు ఎంతో ఉపయోగపడింది. కేవలం 15 పైసల పోస్ట్ కార్డు పోస్ట్ చేస్తే భారతదేశంలో ఎక్కడికైనా చేరిపోయేది. అలాగే ఇన్ ల్యాండ్ లెటర్, ఎన్వలప్ కవర్లు ప్రజలకు అందుబాటులో ఉండేవి. 'తోక లేనిపిట్ట 90 ఆమడలు పోతుంది' అని ఉత్తరంపై ఒక పొడుపుకథ కూడా ఉంది. ముఖ్యమైన సందేశాలను ఒక ప్రాంతంనుంచి మరో ప్రాంతానికి వేగంగా పంపటానికి ఉపయోగపడిన టెలిగ్రామ్ సౌకర్యం ప్రజల విశేష ఆదరణ పొందింది. ఇండియన్ మనీఆర్డర్ ప్రజల్లో విశేష ప్రాచుర్యం పొందింది. అప్పట్లో ప్రజల్లో పోస్ట్ మాస్టర్ కు విశేషమైన ఆదరణ ఉండేది. ఇండ్లలో జరిగే శుభకార్యాలకు వారిని ఆహ్వానించేవారు. సమాజంలో పోస్ట్ మాన్ కు విశేషమైన గౌరవం ఉండేది. పట్టణాల్లోనే కాకుండా మారుమూల ప్రాంతాల్లో కూడా




అంకితభావంతో విధులను నిర్వర్తించి ఉత్తరాలను అందించిన పోస్టల్ సిబ్బంది అభినందనీయులు. కాలం మారింది. సమాచార వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం విశేషంగా అభివృద్ధి చెందింది. నాటి పోస్టల్ శాఖసేవలు మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోయాయి.

## తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

- తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన వైస్ సర్పంచ్ జి. ప్రవీణ్



**ఖమ్మం, ఆగస్టు 05 , నేటి శుభోదయ :** జాతీయ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా వి వెంకటాయపాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ వైస్ సర్పంచ్ జి. ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలే ఉత్తమ ఆహారమని అన్నారు. శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు, మానసిక వికాసానికి తల్లిపాలు ఎంతో అవసరమని తెలిపారు. తల్లులు అపోహలకు లోను కాకుండా వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది సూచనలు పాటించాలని కోరారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలు, సరైన పోషకాహారం, శిశు సంరక్షణపై వివరించారు. అనంతరం తల్లులతో పరస్పర చర్చ నిర్వహించి వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## బోనాల వేళ ఆలయాల వద్ద సౌకర్యాలపై జోనల్ కమిషనర్ దృష్టి

**నేరెడ్ మెట్, ఆగస్టు 05, నేటి శుభోదయ :** బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పౌర సౌకర్యాలు కల్పించేందుకు మల్కాజిగిరి జోనల్ కమిషనర్ మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పలు ఆలయాలను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయాల వద్ద చేపట్టిన ఏర్పాట్లను సమీక్షిస్తూ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆలయాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, రహదారుల పరిస్థితి, డ్రైనేజీ వ్యవస్థ, ఘన వ్యర్థాల నిర్వహణ, దోమల నివారణ చర్యలను పరిశీలించారు. పండుగ రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాలని సూచించారు. పండుగ కాలమంతా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలకు



వెంటనే స్పందించాలని ఆదేశించారు.ఈ తనిఖీల్లో డిప్యూటీ కమిషనర్ (మల్కాజిగిరి), డీఈఈ (ఘన వ్యర్థాల నిర్వహణ), డీఈఈ (విద్యుత్), డీడీ (యూబీడీ), ఏఈ (మెయింటెనెన్స్)తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుంచి దోస్త్ స్పెషల్ ఫేజ్ ప్రవేశాలు

**ఖమ్మం, ఆగస్టు 05 , నేటి శుభోదయ :**
నేటి నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరసంబంధించి ప్రవేశాలకు దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేజ్ –2అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లాఒక ప్రకటనలో తెలిపారు.గురువారంనుంచి ఈనెల 11వరకు రిజిస్ట్రేషన్లు,12వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఉందని వెల్లడించారు.గత దశల్లో చేయని వారికి ఇదే చివరి అవకాశంగా భావించాలని పేర్కొన్నారు.ఇతర వివరాలకు కళాశాల దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్లో సంప్రదించాలని సూచించారు.

## ధర్పల్లి అటవీ శాఖ నూతన కమిటీ ఎన్నిక

## : అధ్యక్షుడిగా జంగేటి నడిపి పోషణ ఏకగ్రీవం



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి ఆగస్టు 05, నేటి శుభోదయ :**
ధర్పల్లి మండల అటవీ శాఖ నూతన కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో శాంతి యుతంగా పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో కమిటీ నూతన అధ్యక్షుడిగా జంగేటి నడిపి పోషణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా హరిలాల్ నాయక్, ప్రవీణ్ గౌడ్ లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో అటవీ సంరక్షణతో పాటు పర్యావరణ అభివృద్ధికి నూతన కమిటీ శక్తివంచన లేకుండా కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అటవీ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## ధర్పల్లి జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు

### : సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణపై సూచనలు




**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, ఆగస్టు 05, నేటి శుభోదయ :**
ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ధర్పల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ దివాస్, ఎన్డీపీఎస్ (మాదక ద్రవ్యాల నివారణ) మరియు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై సందీప్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలు మరియు సైబర్ నేరాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక దుష్పరిణామాలను తెలియజేస్తూ, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలనీ, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అలాగే మైనర్లు ఎలాంటి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు.కార్యక్రమం అనంతరం విద్యార్థులందరూ సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజల్లో అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ శ్రీనాథ్, లెక్చరర్ మహేష్, ఇతర అధ్యాపక బృందం, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ముత్యాల చెరువు నిర్మాణానికి వ్యతిరేకంగా గ్రామీణుల నిరసన

### - సర్వే అధికారుల అడ్డగింత



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, ఆగస్టు 05 , నేటి శుభోదయ :**
ధర్పల్లి మండలం ఒన్న జీపేట్ గ్రామ ముత్యాల చెరువు నిర్మాణంపై స్థానిక ప్రజల నుండి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. బుధవారం చెరువు నిర్మాణ సర్వే నిర్వహించడానికి వచ్చిన అధికారులను వాడి, హోన్నా జీపేట్ మరియు బీరప్ప తండా గ్రామాల ప్రజలు ఏకమై అడ్డుకున్నారు.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే తమ గ్రామాలు, భూములు ముంపునకు గురై తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా విజ్ఞప్తులను మరియు అభ్యంతరాలను పక్కనబెట్టి పనులు ముందుకు తీసుకెళ్లడం సరికాదన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి చెరువు నిర్మాణ పనులను శాశ్వతంగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ తమ సమస్యపై అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తే, పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే ఆయుధం

### - పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం, ఆగస్టు 05 , నేటి శుభోదయ :**
సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే ఆయుధమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ రోజు 'సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ' "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్"అనే ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని అపూర్వంగా సులభతరం చేసినప్పటికీ, అదే సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళ్లు ప్రజల సొమ్ము, వ్యక్తిగత సమాచారం, గోప్యతపై దాడులు చేయడం ఆందోళనకరంగా మారిందన్నారు. నగదులావాదేవీల స్థానంలో యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్వాలెట్లు, ఆన్లైన్ కొనుగోళ్లు, సామాజిక మాధ్యమాల వినియోగం విస్తరించడంతో సైబర్ నేరాలకు అవకాశాలు పెరిగాయని అన్నారు. సైబర్ నేరాల నివారణలో ప్రతి పౌరుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఒటీపీ, యూపీఐ పిన్, సీవీవీ సంఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదన్నారు. తెలియని లింక్ లను నొక్కకూడదన్నారు. ప్రతి ఖాతాకు వేర్వేరు బలమైన సంకేత పదాలను ఉపయోగించాలన్నారు. రెండు దశల ధృవీకరణ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సందేశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని,అనుమానాస్పద కాల్ వస్తే వెంటనే కాల్ నిలిపివేసి సంబంధిత సంస్థ అధికారిక నంబర్లకు సంప్రదించాలన్నారు.ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, నకిలీ వెబ్సైట్లు, నకిలీ మొబైల్ యాప్లు, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రకటనలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపులు, ఓటీపీలు, యూపీఐ అభ్యర్థనలు, క్యూఆర్ కోడ్ల ద్వారా డబ్బు దోచుకునే కొత్త పద్ధతులు విస్తృతంగా పెరిగాయని, నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో మరింత చురుకుగా మారుతుండగా, సాధారణ ప్రజలలో అవగాహన అంతే వేగంగా పెరగకపోవడం సమస్యను మరింత క్లిష్టతరం చేస్తోందన్నారు. ప్రతి నెల వందల సంఖ్యలో సైబర్ మోసాలపై ఫిర్యాదులు నమోదవుతున్నాయని, లక్షల రూపాయల మేర ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అత్యంత విద్యావంతులు కూడా నేరగాళ్ల మానసిక వ్యూహాలకు మోసపోవడం ఈ నేరాల స్వరూపాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు. ఒక్కసారి బ్యాంకు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ లేదా వ్యక్తిగత సమాచారం నేరగాళ్ల చేతికి చేరితే కొన్ని నిమిషాల్లోనే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయని తెలిపారు. ఇటీవలి కాలంలో ప్రమాదకరంగా మారిన నేరాల్లో 'డిజిటల్ ఆరెస్టు' మోసాలని, కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసు అధికారులు పేర్లు చెప్పి వీడియో కాల్ ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ గంటల తరబడి ఫోన్లోనే ఉంచి వారి నుంచి లక్షల రూపాయలు బదిలీ చేయించుకునే సంఘటనలు వెలుగు చూశాయని,అలాగే పెట్టుబడి పెడితే రోజుల్లోనే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మిస్తూ నకిలీ ట్రేడింగ్ యాప్ల ద్వారా లక్షల రూపాయలు కాజేసే సంఘటనలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింక్లను తెరవడం, అపరిచిత యాప్లను డౌన్లోడ్ చేయడం, ఓటీపీలు చెప్పడం, క్యూఆర్ కోడ్లను విచక్షణారహితంగా స్కాన్ చేయడం, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలను అధికంగా పంచుకోవడం, ఒకే సంకేత పదాన్ని అన్ని ఖాతాలకు ఉపయోగించడం వంటి అలవాట్లు నేరగాళ్లకు అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు.ఆన్‌లైన్ మోసాలు లేదా ఆర్థిక సైబర్ నేరాలు జరిగితే బాధితులు వెంటనే టోల్–ఫ్రీ నంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని,ఇది 24 గంటలూ పనిచేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాష్, ఉస్మాన్ షరఫ్, రవికుమార్, ఎస్సై లు రంజిత్ కుమార్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# పంట బీమా రైతు బీమా తక్షణమే అమలు చేయాలి

### - అఖిలభారత ఐక్య రైతు సంఘం (AIUKS) డిమాండ్



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఆగస్టు 05, నేటి శుభోదయ :**
రాష్ట్రం లో వర్షంభావ మూలంగా వేసిన విత్తనాలు మొలకెత్తకుండా మొలకెత్తిన విత్తనాలు ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం తక్షణమే కల్పించాలి అని సిరికొండ మండల కేంద్రం లో ఏఐయుకేఎస్ ఆధ్వర్యంలో డిప్యూటీ తాసిల్దార్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఏఐయుకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. బాబన్న మాట్లాడుతూ రాష్ట్రం లో ఎల్ నీనో ప్రభావం వల్ల ఈ ఖరీఫ్ సీజన్లో జూలై మూడో వారం వరకు వర్షపాతం 30 నుండి 40 శాతం మాత్రమే నమోదు అయింది వాతావరణ శాఖ ప్రకటన మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి నిజాంబాద్ జిల్లా సాగుకు సిద్ధమైన రైతాంగం ప్రధానంగా పత్తి సోయా మొక్కజొన్న విద్యుత్ మోటార్ల కింద పంట సాగు చేశారు విత్తనం విత్తిన తర్వాత పత్తి తదితర పంటలు లక్షలాది ఎకరాలలో విత్తనం మొలకెత్తలేదు అనేక చోట్ల మొలకెత్తిన విత్తనానికి నీరు కరువై ఎండిపోయిన స్థితి మన జిల్లాలోనూ రాష్ట్రంలోను ఉంది సుమారు ఒక ఎకరానికి ఒక రైతు ఎరువులు మరియు సాగు ఖర్చు 40వేల నుండి 50 వేల రూపాయలు ఖర్చు పెట్టారు ఆశలు నిరాశై రెండవసారి కూడా విత్తనాన్ని పెట్టినవి కూడా ఎండిపోయాయి ప్రధానమంత్రి ఫసల్ బీమా ఈ రాష్ట్రంలో గత ప్రభుత్వం అమలు చేయలేదు ఎన్నికల వాగ్దానంలో భాగంగా పంటల భీమ అమలు చేసి రైతులను ఆదుకుంటామని ప్రధాన మంత్రి ఫసల్ బీమా లో చేరి రాష్ట్రం వాటా చెల్లిస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి నాడు వాగ్దానాలు చేశారు ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన తర్వాత పదేపదే ప్రకటనలు చేశారు తప్ప ఫసల్ బీమా పథకంలో చేరలేదు బ్యాంక్ అధికారులు రైతులు అప్పులు ఇచ్చిన సందర్భంగా పంట బీమా తప్ప ఫసల్ బీమా పథకంలో చేరలేదు ప్రకృతి వైపరీత్యంలో నష్టపోయిన పంటకు ఎలాంటి బీమా అమలు చేయడం లేదు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనూ నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనూ రైతులు మోసానికి గురవుతున్నారు రైతు బీమా రైతు సహజ మరణం చెందిన రైతుకి కుటుంబానికి 5 లక్షల రూపాయలు ఇచ్చేవారు నేడు అయిదు పైసలు కూడా ఇవ్వడం లేదు అనే విషయాన్ని గమనించాలి వర్ష భావం వల్ల నష్టపోయిన రైతుకి ఎకరానికి 50 వేల రూపాయలు ఏకకాలంలో రుణాలు రద్దుచేసి నూతన రుణాలు ఇవ్వాలి పంట బీమా రైతు బీమా అమలు చేయాలి పశువుల గసాం ప్రభుత్వమే సరఫరా చేయాలి డిమాండ్ చేస్తున్నాం వర్ష బావ మూలంగా వ్యవసాయ కూలీ కుటుంబానికి ఉపాధి చూపించి దినసరి 650 రూపాయలు ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పని కల్పించాలని జీవనానికి నెలకు పదివేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో AIUKS జిల్లా నాయకులు మల్కి లింభాద్రి, పండరి, పూర్రా రాజన్న, గామ గంగన్న, రణదీష్ పి వై ఎల్ రాష్ట్ర నాయకులు కే. ఆశిష్ తదితరులు పాల్గొన్నారు

## వేణుకుమార్‌కు మరోసారి అండగా నిలిచిన మాజీ ఎంపీ నామ

- **వేణుకుమార్ డిశ్చార్జ్ బిల్లు మాఫీ చేయించిన మాజీ ఎంపీ నామ**
- **ప్రక్లిష్ట సమయంలో మానవత్వం చాటిన మాజీ ఎంపీ నామ**





**ఖమ్మం, ఆగస్టు 05, నేటి శుభోదయ :**
గ్రూప్స్ నోటిఫికేషన్ల విడుదలలో జాప్యంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన జి. వేణుకుమార్ సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మరోసారి మానవత్వాన్ని చాటుతూ ఆస్పత్రి యాజమాన్యంతో నేరుగా మాట్లాడి వేణుకుమార్ డిశ్చార్జ్ బిల్లును మాఫీ చేయించారు. ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి చేరిన వేణుకుమార్‌కు సకాలంలో వైద్య సేవలు అందించిన డాక్టర్ కేసోజు భరత్ బాబు, ఆస్పత్రి వైద్య బృందం, నర్సింగ్ సిబ్బందిని నామ అభినందించారు. ఇప్పటికే నామ ట్రస్ట్ తరపున వేణుకుమార్‌కు రూ.50 వేల ఆర్థిక సాయం అందించిన నామ వారి కుటుంబంపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు. వేణుకుమార్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన అనంతరం వేణుకుమార్, ఆయన కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా నామకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేణుకుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నామ, జీవితంలో ఇంకా ముందుకు వెళ్లాలని, సాధించాల్సింది చాలా ఉందని ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. వేణుకుమార్ త్వరగా పూర్తిగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించిన ఆయన, నిరుద్యోగ యువత ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని మరోసారి విజ్ఞప్తి చేశారు.

# మాతా-శిశు సేవలను సద్వినియోగం చేసుకోండి

**- మంథని ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. టి.వి. రాజశేఖర్ రెడ్డి**

**మంథని, ఆగస్టు-05, నేటి శుభోదయ :** మంథని మాతా–శిశు ఆరోగ్య కేంద్రంలో బుధవారం రెండు సిజేరియన్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. గైనకాలజిస్ట్ డా. మామిడిపల్లి స్రవంతి, అనస్థీషియా నిపుణు రాలు డా. గుంట మౌనిక, శిశు వైద్య నిపుణుడు డా. చిలకలపల్లి నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శస్త్రచికిత్సల ద్వారా ఒక బాబు, ఒక పాప జన్మించారు. తల్లులు, నవజాత శిశువులు పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. టి.వి. రాజ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో మంథని ఏరియా ఆసుపత్రికి రెగ్యులర్ స్పెషలిస్ట్ వైద్యులను నియమించారని తెలిపారు. దీంతో మంథని ప్రాంత గర్భిణీలు, చిన్నారులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు.ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా అన్ని వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబా టులో ఉన్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసు కోవాలని ఆయన కోరారు. వైద్య సేవలకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా సూచనలు ఉంటే నేరుగా మెడికల్ సూపరిం టెండెంట్‌ను 9885808589 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



# హెచ్ఆర్సీసీఐ జిల్లా జాయింట్ సెక్రెటరీగా - నాగేశ్వరరావు

**ఖమ్మం, ఆగస్టు 05, నేటి శుభోదయ :** హెచ్ ఆర్ సి సి ఐ ఖమ్మం జిల్లా జాయింట్ సెక్రటరీగా ఖమ్మం పట్టణా నికి చెందిన కన్నె కంటి నాగేశ్వరరా వును నియమిస్తూ సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు సింగమల వెంకట రమణయ్య, రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కిషోర్ కుమార్ ఆదేశాలు జారీ చేసి నియమించినట్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించినటువంటి జాతీయ అధ్యక్షులు వారికి రాష్ట్ర అధ్యక్షులు వారికి జిల్లా చైర్మన్ కు రాష్ట్ర కమిటీకి జిల్లా కమిటీకి డైరెక్టర్స్ కి తమ కృతజ్ఞతలు తెలిపారు. తమకున్న అవకాశం మేర సంస్థ బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు. బడుగు బలహీన వర్గాల సమస్యలతో పాటు రాజ్యాంగం కల్పించినటువంటి హక్కులకు ఉల్లంఘన కలిగితే వారు పక్షాన అండగా నిలిచి న్యాయం జరిగే వరకూ నిలుస్తామని చెప్పారు.




# తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ప్రొఫెసర్ జయశంకర్‌కు నిజమైన నివాళి

- **మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

**ఖమ్మం, ఆగస్టు 05, నేటి శుభోదయ :** జయశంకర్ చూపిన బాటలోనే తెలంగాణ ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చారు కేసీఆర్. గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ మేధావి, పోరాట స్ఫూర్తి ప్రదాత ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆయనను స్మరించుకున్నారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సిద్ధాంత బలం, మార్గదర్శ కత్వం, త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన చూపిన బాటలోనే తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ముందుకు నడిపించారని, అచంచల సంకల్పం, మొక్కవోని దీక్ష, సాహ సోపేత పోరాటంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని అన్నారు.తెలంగాణ గౌరవాన్ని, సామాజిక–రాజకీయ అస్తిత్వాన్ని, స్వాభిమానాన్ని పరిరక్షించుకోవడమే ప్రొఫెసర్ జయశంకర్‌కు మనం అందించే నిజమైన ఘన నివాళి అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పునరుద్ఘాటించారు.ప్రొ ఫెసర్ జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా కేసీఆర్ నాయ కత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, తాగునీరు, సంక్షేమం, మౌలిక సదుపా యాల అభివృద్ధి వంటి అన్ని రంగాల్లో విశిష్టమైన పురోగతి



సాధిస్తూ, సబ్బండ వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని సకల జనుల అభ్యున్నతికి కృషి చేయడం ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ కలల తెలంగాణను సాకారం చేసే దిశగా కేసీఆర్ ప్రభుత్వం పనిచేసిందని తెలిపారు.

# కెమెరా పట్టిన చేతికి ఇప్పుడు చేయూత కావాలి

**వైరా, ఆగస్టు 05, నేటి శుభోదయ :** వైరా లో అనారో గ్యంతో బాధపడు తున్న ఫోటోగ్రాఫర్ రాజుమందులు కొనలేని ఆర్థిక పరిస్థితి.. దాతల సహకారంకోసంఎదు రుచూస్తున్న lరూ.15 వేల ఆర్థిక సాయం అందించిందిజిల్లా,మండలఫోటోగ్రాఫర్స్అసోసియేష న్ఎన్నో కుటుంబాల ఆనంద క్షణాలను తన కెమెరాలో బంధించిన ఫోటో గ్రాఫర్ పమ్మి రాజు నేడు జీవిత పోరాటంలో ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు వైద్య చికిత్స చేయించుకోవడానికి, నిత్యం మందులు కొనుగోలు చేసుకోవడానికి కూడా డబ్బులు లేక దయనీయ పరిస్థితి నెలకొంది.ఈ విషయం తెలుసుకున్న జిల్లా,మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు మానవత్వంతో స్పందించి తొలి విడతగా రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సాయం ద్వారా చికిత్సకు కొంత ఊరట లభించినప్పటికీ, పూర్తి వైద్యం కోసం మరింత ఆర్థిక సహాయం అవసరమని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకట్‌తో పాటు తిరుపతిరావు,రాజారావు, ఎక్కిరాల శ్రీని వాసరావు, చెర్రీ తదితరులు రాజును పరామర్శించి ధైర్యం చెప్పారు.సేవా భావం కలిగిన దాతలు, ఫోటోగ్రాఫర్లు, ప్రజలు తమకు చేతనైనంత సహాయం అందించి రాజు త్వరగా కోలుకునేలా అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు.మనిషికి మనిషే అండ అనే భావనతో ప్రతి చిన్న సహాయం రాజు చికిత్సకు గొప్ప తోడ్పాటుగా నిలుస్తుందని అసోసియేషన్ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# ఆగస్టు10 లోపు ఎలిమినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి -ఎస్ఐఆర్

- **ఎలిమినేషన్ ఫామ్స్ గడువు ఇంకా 5 రోజులే మిగిలింది**
- **డిప్యూటీ కమిషనర్ బి సత్యనారాయణ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం,ఆగస్టు5, నేటి శుభోదయ :** బుధవారం ఆదిభట్ల సర్కిల్–15 పరిధిలోని రాగన్నగూడ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్. కార్యక్రమంపై సమీక్ష సమావేశం డిప్యూటీ కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించబడింది.సమావేశంలో బీఎల్‌వోలు బీఎల్‌వో సూపర్వైజర్లు,అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బీఎల్ఏలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమి షనర్ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న ఎలిమినేషన్ ఫారాలు మరణించిన వారుశాశ్వతంగా మారిన వారు, డూప్లికేట్ నమోదులు వంటి పేర్లను తొలగించేందుకు సంబంధించిన ఫారాలు. అన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి,2026 ఆగస్టు 10వ తేదీలోపు పూర్తి స్థాయిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీ లించి,ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.అలాగే సర్ కార్యక్రమాన్ని సమర్థవం తంగా అమలు చేయడానికి అన్ని శాఖల అధికారులు, బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్వైజర్లు రాజకీయ పార్టీల బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ బి.సత్యనా రాయణ రెడ్డి,అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు బిఎన్ కె రమేష్,ఎస్. శ్రీనివాసులు,బీఎల్‌వో సూపర్వైజర్లు,బీఎల్‌వోలు,





అన్ని రాజకీయ పార్టీల బీఎల్ఏలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం, ఆగస్టు 05, నేటి శుభోదయ :** సమీకృత జిల్లా కలెక్టరేట్ లోనీ ఈ.వి.ఎం. గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. నెలవారి తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసి గోడౌన్ రూం సీల్ ను, సీసీ కెమెరాల పని తీరును పరిశీలించి తనిఖీ రిజిస్టర్ లో సంతకం చేసి భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా చేస్తున్న డ్యూటీలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని, భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదే శించారు.జిల్లా కలెక్టర్ వెంట ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, కలె క్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజు, డిటి అన్సారీ, ఆర్ అండ్ బి, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.





## షిరిడి సాయిబాబా మందిరంలో నాట్య మయూరి మీన నృత్య ప్రదర్శన లు



**ఖమ్మం, ఆగస్టు 05, నేటి శుభోదయ :** మీనా నృత్యాలయ నాట్యా మయూరి మీనా ఏలూరి బృందం షిర్డీ సాయిబాబా మందిరంలో నృత్య ప్రదర్శనలు చేసి ప్రశంసలు పొందారు. ఖమ్మం నుంచి వెళ్లిన మీనా బృందం కళాకారులను ఆలయ కమిటీ వాళ్ళు ఆదరించారు స్వామివారు ఉత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది మీనా తో పాటుగా ఆమె శిష్యురాలు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. నాట్య కళాకారులను ఘనంగా సత్కరించారు.

## అంగరంగ వైభవంగా ఆరు గ్రామంలో బోనాల జాతర



**సంగారెడ్డి, ఆగస్టు5 ,నేటి శుభోదయ :** సదాశివపేట మండలంలోని ఆరూరు గ్రామంలో పోచమ్మ తల్లికి బోనాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పాల్గొని అమ్మవారి బోనం ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో సస్య శ్యామలంగా ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలను కలిగి ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందన్నారు.గ్రామంలోని ప్రతి ఇంటిలోని మహిళలు అమ్మవారికి బోనాలు గ్రామంలోని మహిళలందరూ ఊరేగింపుగా పోచమ్మ తల్లికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం జరిగింది.జోగిని సాయి ప్రియ శివశక్తులు అవతారంతో అందర్నీ ఆకర్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయికోటి లావణ్య మధు, ఉపసర్పంచ్ విట్టల్, వార్డు మెంబర్లు నాగేష్, భరత్, రమేష్, అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్, మాజీ ఎంపిటిసి శివ కుమార్, లలిత, గ్రామ పెద్దలు రాఘవేందర్, బాలయ్య, లక్ష్మణ్ గౌడ్, డాక్టర్ రాజకుమార్, సంగమేశ్వర్, నర్సింలు, కృష్ణ, రమేష్, మానయ్య, నారాయణ గౌడ్గ్రామంలోని పెద్దలు యువకులు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పద్మశాలి సేవాసంఘం పాతకేరి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల మహోత్సవం



**సంగారెడ్డి, ఆగస్టు5 ,నేటి శుభోదయ :** సదాశివపేట పట్టణంలోని పాతకేరిలో పద్మశాలి సేవాసంఘం అధ్యక్షుడు చిల్వేరి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంగారెడ్డి ఎమ్మెల్యే తనయుడు చింతా సాయినాథ్, చేనేత సహకార సంఘం చింతా గోపాల్, అశోక్, కరుణాకర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పద్మశాలి కులబాంధవులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని మేకలను బలి ఇచ్చి, వస్త్రాలు సమర్పించి, ఓడి బియ్యాన్ని సమర్పించారు. అనంతరం బోనాలను దుర్గాభవాని ఆలయం వరకు డప్పు చప్పుళ్లు, మేళతాళాలు, వాయిద్యాలు, ఆటపాటల నడుమ భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ న్యాలం అర్జున్ ఫణిక్రిష్ణ, పద్మశాలి సేవాసంఘం అధ్యక్షుడు చిల్వేరి రవి, ప్రధాన కార్యదర్శి కొంగరి ప్రభు, ఉపాధ్యక్షుడు మేకల జనార్ధన్, ప్రచార కార్యదర్శి సోమ శంకర్, ముఖ్య సలహాదారులు చిల్వేరి వెంకటేశం, రుమాండ్ల రాజు, నెల్లి క్రిష్ణ, మధునాల శివాజి, అమృతం స్వామి, బిజ్జరాజు, కార్యవర్గ సభ్యులు పద్మ మాణిక్యం,మాదాసు రాజు, పరమదాసు, జగన్నాథం, కొంగరి నర్సింలు, ఇమ్మడిశెట్టి గోపాల్ తదితరులు, పద్మశాలి కులబాంధవులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో ఈ నెల 10న జైల్ భరో

### -సిఐటియు తుర్కయంజాల్ సర్కిల్ కన్వీనర్ ఎం సత్యనారాయణ





**ఇబ్రహీంపట్నం,ఆగస్టు5, , నేటి శుభోదయ :** తురక ఏంజెల్ సర్కిల్ పరిధిలోనిది క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ నెల 10వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం. సిఐటియు,ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యు యు,సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 10న జరగబోయే జైల్ భరో కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ తుర్కయంజాల్ డివిజన్ లోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను కలిసి కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు తుర్కయంజాల్ కన్వీనర్ మండల సత్యనారాయణ మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం రాకముందు నుండి పోరాడి సాధించుకున్న చట్టాలను అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం★ 4 లేబర్ కోడ్స్ గా కుదించి కార్మికుల హక్కులను కాల రాస్తున్నది. మహాత్మా గాంధీ ఉపాధి పథకం పేరుని మార్చి విబిజిరామ్ జీ పెట్టడం జరిగింది.వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే విత్తన సవరణ చట్టాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధమవుతోంది అలాగే 2025 విద్యుత్ సవరణ చట్టం తీసుకు వచ్చి స్మార్ట్ మీటర్ల పేరుతో దేశ ప్రజలను అంధకారంలోకి నెట్టి ప్రయత్నం చేస్తుంది.క్విట్ ఇండియా ఉద్యమ సూక్తితో తిరుగుబాటు తప్పదని కేంద్ర ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేసి మన హక్కులను దేశ ప్రజల భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని కుల మతాలను రెచ్చగొట్టి పెంచి పోషిస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాటాలు తప్పవని, మన దేశాన్ని 200 సంవత్సరాలు పరిపాలించిన బ్రిటిష్ వాళ్ళపై తిరుగుబాటు చేసి దేశానికి స్వాతంత్రం తెచ్చుకున్న మనం,అదే స్ఫూర్తితో మతతత్వ పార్టీ అయినా నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని నడ్డి విరిచే విధంగా పోరాటం చేయాలని ఆగస్టు 10వ తేదీన జరగబోయే జైల్ బరో కార్యక్రమానికి కార్మికులంతా అధిక సంఖ్యలో పాలొని జయప్రదం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పైళ్ల మధు ప్రేమలత సాలమ్మ రాములమ్మ డి రమ దేవి అందాలు వెంకటమ్మ స్వప్న అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎలిమినేడు ప్రభుత్వ పాఠశాలలో షూ పంపిణీ

- ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం సిఐ మహేందర్ రెడ్డి
- గ్రామ సర్పంచ్ మంద యాదమ్మ




**ఇబ్రహీంపట్నం,ఆగస్టు5 , నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రోజున పిల్లలకు షూ పంపిణీ చేయడం జరిగింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చే జారీ చేయబడిన షూ పంపిణీ కార్యక్రమం ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంద యాదమ్మ,సిఐ మహేందర్ రెడ్డి,ఎస్సై రామకృష్ణ పాల్గొని పిల్లలకు విద్యాపద నిర్దేశం చేశారు.పిల్లలందరూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు గ్రామానికి ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరోజు సుధాకర్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఛాతీ వ్యాధుల శస్త్రచికిత్సలో 'మినిమల్లీ ఇన్వాసివ్ థొరాసిక్ సర్జరీ

### -యశోద హాస్పిటల్స్ థోరాసిక్ సర్జన్ డాక్టర్ సి.రోహన్ రెడ్డి




**నిజామాబాద్, ఆగస్ట్ 05, నేటి శుభోదయ :** ఊపిరితిత్తులు,అన్నవాహిక,ఛాతి మధ్య భాగం (మీడియాటినం),డయాఫ్రేమ్,ఛాతీ గోడకు వచ్చే వ్యాదులను గుర్తించి చికిత్స చేయడానికి సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ అత్యాధునిక విదానాలను ఉపయోగిస్తోందని యశోద హాస్పిటల్స్ దొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.రోహన్ రెడి అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ....మినిమల్లీ ఇన్వాసివ్,రోబోట్ సహాయంతో చేసి సర్జరీల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు.ఊపిరితిత్తుల క్యాన్సర్,అన్నవాహిక క్యాన్సర్,ఛాతీలో కణితులు వంటి వ్యాదులపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందని,వ్యాదిని త్వరగా గుర్తించడం వల్ల పేషంట్లకు మరింత సురక్షితమైన ఆపరేషన్లను ఆసుపత్రి అందిస్తోందన్నారు.దీని ద్వారా ఖచ్చితమైన చికిత్స లబించడమే కాకుండా,పేషెంట్లు త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఇంటికి వెళుతున్నరన్నారు.థొరాసిక్ సర్జరీ అంటే గుండెను మినహాయించి,చాతీలో వచ్చే ఇతర వ్యాధులకు చేసే ప్రత్యేకమైన ఆపరేషన్,కొన్ని క్లిష్టమైన సమస్యలకు చాతీని పూర్తిగా తెరిచి చేసే ఓపెన్ సర్జరీ తప్పనిసరి అయినప్పటికీ,ఇప్పుడు ఆధునిక పద్దతులు అందుబాటులోకి వచ్చాయన్నారు.వీడియో కెమెరా సాయంతో చేసే సర్జరీ (వాట్స్),రోబోట్ సహాయంతో చేసే సర్జరీ (రాట్స్)వంటి పద్ధతుల ద్వారా కేవలం ఒక చిన్న రంధ్రం లేదా కోతతో ఆపరేషన్లు చేస్తున్నారన్నారు.వీటివల్ల పేపింట్లకు సర్జరీ కోత,నొప్పి చాలా తక్కువగా ఉంటాయని,ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం కూడా ఉండదన్నారు.పేషేంట్లు చాలా త్వరగా తమ పనులు తాము చేసుకోగలుగుతారన్నారు.డాక్టర్లు కూడా చుట్టుపక్కల ఉండే అవయవాలకు ఎలాంటి హాని కలగకుండా చాలా ఖచ్చితత్వంతో ఈ ఆపరేషన్ చేయగలుగుతున్నరన్నారు.గత పదేళ్లలో చాతీ సర్జరీలో ఎన్నో మార్పులు వచ్చాయని ఈరోజుల్లో చిన్న కోతతో లేదా రోబోట్ సహాయంతో ఆపరేషన్లు చేస్తున్నామన్నరు.దీనివల్ల సంక్లిష్టమైన సమస్యలకు కూడా శరీరానికి పెద్దగా ఇబ్బంది కలగకుండా ఖచ్చితంగా చికిత్స చేయగలుగుతున్నాం అని చెప్పారు.వ్యాధిని ముందుగానే గుర్తించడం ఆధునిక సర్జరీ నైపుణ్యాలు అన్ని విభాగాల వైద్యులు కలిసి క్యాన్సర్ కు వైద్యం చేయడం వల్ల సిషేంట్లకు అత్యుత్తము చికిత్స అందుతోందన్నారు.వారు త్వరగా కోలుకొని సాధారణ జీవితం గడపగలుగుతున్నారన్నారు.ప్రతి పేషంట్ కు వారి ఆరోగ్య పరిస్తితికి తగట్టుగా ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూనేతో ప్రేమతో కూడిన వైద్యం అందించడమే మా లక్ష్యం అని ఆయన వివరించారు.ఆదువాతన ఆపరేషన్ థియేటర్లు,హై-డెఫినిషన్ ఇమేజింగ్ సిస్టమ్స్,రోబోటిక్ సర్జికల్ ప్లాట్ఫారమీలు,థొరాసిక్ సర్జన్లు,పల్మోనాలజిస్టు,ఆంకాలజిస్టు,రేడియాలజిస్టు,అనస్తీషియాలజిస్ధలు,క్రిటికల్ కేర్ నిపుణులతో కూడిన మల్టీడిసిప్లేనరీ బృందం మద్దతుతో,యశోద హాస్పిటల్స్ అనేక రకాల థొరాసిక్ (చాతి) సమస్యలకు సమగ్రమైన చికిత్సను అందిస్తోందన్నారు.ప్రారంభ దశలో ఉన్న ఊపిరితిత్తుల క్యాన్సర్లు,అన్నవాహిక వ్యాధుల నుండి ప్రాణాపాయం లేని ఛాతి కణితులు సంక్లిష్టమైన దాతీ ఎమర్జెన్సీల వరకు,హాస్పిటల్ ఎవిడెన్స్-బేస్డ్,మినిమల్లీ నాసిస్ సర్జికల్ సేవలను నిరంతరం విస్తరిస్తోందన్నారు.పేషింట్లు మెరుగైన భద్రత సౌకర్యంతో మంచి పలితాలను సాదించడంలో సహాయపడుతుందన్నారు.యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ గత మూడు దశాబ్దాలుగా వైవిద్యమైన వైద్య అవసరాలు కలిగిన ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందిస్తోందని,సమర్ధవంతమైన నాయకత్వం బలమైన యాజమాన్యం కింద,యశోద గ్రూప్ అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య చికిత్సను అందించే 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా ఎదిగిందన్నారు.పేషంట్ల అవసరాలకు అనుగుణంగా,అరుదైన క్లిష్టమైన ప్రక్రియల కోసం సైతం విప్లవాత్మక సాంకేతికతను ఉపయోగిస్తూ,యశోద గ్రూప్ ప్రతి వైద్య విభాగంలోనూ అత్యాధునిక రోగనిర్ధారణ చికిత్సా సేవలను అందిస్తోందన్నారు.ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ మేనేజర్ రూపేష్ షిండే,మార్కెటింగ్ మేనేజర్ అమర్నాథ్ మూర్తి లు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో వంద పడకల ఆసుపత్రి

## -కల నెరవేర్చడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం.

- **ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి**
- **శిథిలాల స్థానంలో శతపడకల ఆశల సౌధం**
- **తీరని వేదనకు చిరునామాగా నిలిచిన చోటే ఆశల ఆలవాలం**
- **ఆరోగ్య ఇబ్రహీంపట్నానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సంకల్పం**
- **డిప్యూటేషన్ పై వెళ్లిన స్పెషలిస్టులంతా తిరిగి రాక.**
- **ఆరేడు నెలల్లో ఏరియా ఆస్పత్రి నూతన భవనంలో సేలవందించేందుకు ఏర్పాట్లు**





**ఇబ్రహీంపట్నం, ఆగస్టు5, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలో నిన్నమొన్నటి వరకు ఇద్దరుముగ్గురు వైద్యులు, పది ఇరవై పడకలకు పరిమితమైన ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి... ఒక విషాద ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన వైద్యకేంద్రం... నిరాశ నిండిన గోడల మధ్య ప్రజలు ఆశ కోసం ఎదురు చూస్తున్న అదే ప్రాంగణంలో ఆరోగ్య భవిష్యత్తును ఆవిష్కరించే నూతన అధ్యాయం ప్రారంభం కానుంది. కాలం గాయాలను మోస్తున్న పాత భవనానికి వీడ్కోలు పలికి, ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించే వంద పడకల మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి రూపుదిద్దుకుంటోంది.రాజకీయాలకు అతీతంగా ప్రజారోగ్యాన్ని ప్రజాసేవగా భావిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి సంకల్పానికి ఇబ్రహీంపట్నం ఏరియా ఆస్పత్రి భవనం ప్రతీకగా నిలుస్తోంది.గతంలో ఒకరిద్దరు వైద్యులు, చాలీచాలని సౌకర్యాలు, అంతంత మాత్రంగానే సిబ్బందితో ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి కొనసాగుతూ వచ్చింది. ఈ క్రమంలోనే నాలుగేళ్ల క్రితం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు వికటించి, నలుగురు బాలింతలు ప్రాణాలు కోల్పోయిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్రకలకలంరేపింది.నాడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి,తాము అధికారంలోకి వచ్చాక ఈ ఆస్పత్రి స్థానంలో అత్యున్నత ప్రమాణాలతో వైద్యకేంద్రం నిర్మిస్తామని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత దుర్ఘటనల దృష్ట్యా ఇబ్రహీంపట్నం ఆస్పత్రి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,వెంటనే పాతభవనం కూల్చివేయించి,వంద పడకలతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.ఇందులో భాగంగానే గత జూన్ లో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిని ఏరియాఆస్పత్రిగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది.దీంతో ఏకంగా 23 మంది స్పెషలిస్టు వైద్యులు ఇక్కడికి నియమితులయ్యారు.నిర్మాణ పనుల కారణంగా తాత్కాలికంగా మున్సిపాలిటీ భవనంలో వైద్యసేవలు కొనసాగుతున్నాయి. చిన్న భవనంలో అన్ని విభాగాల వైద్య సేవలు అందించడం సాధ్యంకాక, స్పెషలిస్టు వైద్యులు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఫలితంగా మరోసారి ఆస్పత్రిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులే మిగిలి ప్రజలకు సేవలందిస్తున్నారు.సచివాలయంలో సమీక్షతో కదలిక.నియోజకవర్గంలో వైద్యారోగ్యశాఖ స్థితిగతులపై సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,ఉన్నతాధికారులతో ఇటీవల సమీక్ష నిర్వహించారు.ప్రైవేటు ఆస్పత్రుల దోపిడి, అర్హతలేని వారి వైద్యం కారణంగా ప్రజలు పడుతున్న అవస్థలను వివరించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో సదుపాయాలు, డాక్టర్ల భర్తీ, సిబ్బంది నియామకంపై దిశానిర్దేశం చేశారు.ఫలితంగా గతంలో డిప్యూటేషన్ పై వెళ్లిన 21మంది స్పెషలిస్టులు తిరిగి ఇబ్రహీంపట్నం బాట పట్టారు. వీరిలో నలుగురు గైనకాలజిస్టులు,ఇద్దరు సర్జన్లు, ఇద్దరు చర్మవ్యాధి నిపుణులు, ముగ్గురు చిన్నపిల్లల వైద్యులు,ముగ్గురు జనరల్ ఫిజీషియన్లు, ఒక ఆర్థోపెడిక్ డాక్టర్, ఇద్దరు కంటి వైద్యనిపుణులు, ముగ్గురు అనస్థీషియా వైద్యులున్నారు.ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసిన స్పెషలిస్టులు.డిప్యూటేషన్ పై వెళ్లి, తిరిగి వచ్చిన స్పెషలిస్టులంతా క్యాంపు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే సంకల్పానికి అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఆస్పత్రి భవనం అందుబాటులోకి వస్తే పూర్తిస్థాయిలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వ డాక్టర్లు చెప్పారు.ఆరేడు నెలల్లో కొత్త భవనం అందుబాటులోకి తెచ్చేందుకు కృషి మల్ రెడ్డి రంగారెడ్డి,ఒకప్పుడు విషాదానికి చిరునామాగా నిలిచిన అదే ఆస్పత్రి నేడు ఆశలకు ఆలవాలంగా మారుతోందని,ఇటుకలతో కట్టేది కేవలం భవనం మాత్రమే కాదు.వేలాది కుటుంబాల ఆరోగ్య భవిష్యత్తుగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నానికి తిరిగి వచ్చిన వైద్యనిపుణులతో సమావేశమైన ఎమ్మెల్యే.ఈ మేరకు వారికి దిశానిర్దేశం చేశారు.100 పడకలతో సకల సౌకర్యాలతో గాంధీ, ఉస్మానియా దవాఖానాల తరహా సేవలతో కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా ఇది రూపుదిద్దుకుంటోందన్నారు. మరో ఆర్నెళ్లలో కొత్త భవనంలో వైద్యసేవలు అందుబాటులోకి వచ్చేలా చూస్తానని చెప్పిన మల్ రెడ్డి."ఆరోగ్య ఇబ్రహీంపట్నం"లక్ష్యం వైపు పడుతున్న ప్రతి అడుగులో భాగస్వామ్యం కావాలని వైద్యులకు సూచించారు.రేపటి తరాలకు మెరుగైన ప్రభుత్వ వైద్యసేవలను అందించే దిశగా ఇబ్రహీంపట్నం నేడు ఆరోగ్య విప్లవానికి నాంది పలుకుతోందన్నారు.

# 15 ఏళ్లయినా మారని బోడంపహాడ్ మన్మరి అప్పరెడ్డిగూడ రోడ్డు

## రూపురేఖలు నిత్యం ప్రమాదాలతో వాహనదారులకు నరకయాతన

- **షాబాద్ మండలంలో అన్ని గ్రామాల రోడ్లకు నిధులు కానీ ఈ రహదారికి మాత్రం మొండిచెయ్యి**
- **వెంటనే అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేయాలని డిమాండ్**



**షాబాద్, ఆగస్ట్5, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం బోడంపహాడ్ మన్మరి అప్పరెడ్డిగూడ గ్రామ ప్రజలకు వాహనదారులకు రోడ్డు ప్రయాణం నరకప్రాయంగా మారింది గత 15 ఏళ్ల క్రితం వేసిన రోడ్ తీవ్రంగా దెబ్బతిని ప్రస్తుతం బాట పొడవునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి పగటిపూట ఈ దారిన వెళ్లడమే కష్టంగా ఉంటే రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగి అనేకమంది ద్విచక్రవాహనదారులు యాక్సిడెంట్ అయ్యి ప్రాణాలు కోల్పోయినారు మరియు తీవ్ర గాయాలపాలవుతున్నారు షాబాద్ మండల వ్యాప్తంగా పలు గ్రామాలకు రోడ్డు మరమ్మతులు నూతన రహదారుల నిర్మాణం చేపడుతున్నప్పటికీ బోడంపహాడ్ గ్రామానికి వచ్చే రహదారిని మాత్రం పాలకులు అధికారులు పూర్తిగా విస్మరించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారునిత్యం ప్రమాదాలు పటాపంచలవుతున్న హామీలు గ్రామంలో ఎవరైనా అనారోగ్యం పాలైనా గర్భిణులను ఆస్పత్రికి తరలించాలన్నా ఈ గుంతల రోడ్డుపై నరకయాతన అనుభవించాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఓట్లు అడిగే సమయంలో పెద్ద పెద్ద హామీలు ఇచ్చే ప్రజాప్రతినిధులుగెలిచాక ఈ గ్రామ రహదారి వంక కనీసం కన్నెత్తి చూడకపోవడం ఘోరమని మండిపడుతున్నారు ఇప్పటికైనా రోడ్డు నిర్మాణానికి సంబంధిత అధికారులు ఎమ్మెల్యే మరియు ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న సాయిరాజుకు మంత్రి శ్రీధర్ బాబు భరోసా

## - 2 లక్షల 50 వేలు ఎల్ఓ సి మంజూరు



**మంథని/పెద్దపల్లి , ఆగష్టు -05, నేటి శుభోదయ :** మంథని నియోజకవర్గంలోని కాటారం మండలం దేవరాంపల్లి గ్రామానికి చెందిన చీమల సాయి రాజ్ తండ్రి నర్సింహులు నిమ్స్ ఆసుపత్రి లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ సహాయం కొరకు ఐటి పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు తెలుపగా వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం వీరికి 2 లక్షల 50 వేలు మంజూరు చేయించి మంత్రి ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అందచేయడం జరిగింది. చికిత్స కోసం 2లక్షల 50 వేలు మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబు కు వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# కమాన్పూర్‌లో 108 అంబులెన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కోఆర్డినేటర్



**మంథని/కమాన్పూర్ , ఆగస్టు-05, నేటి శుభోదయ :** పెద్దపల్లి జిల్లా 108 అంబులెన్స్ కోఆర్డినేటర్ జంపాల కుమార స్వామి బుధవారం కమాన్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలందిస్తున్న 108 అంబులెన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని వైద్య పరికరాలు, అత్యవసర ఔషధాలు, నిర్వహణ విధానం, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అత్యవసర కాల్ వచ్చిన వెంటనే సిబ్బంది వేగంగా స్పందిస్తూ సమయపాలనతో సేవలు అందించాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాలు, గర్భిణీల ప్రసవ అత్యవసర పరిస్థితులు, వర్షాకాలంలో పెరుగుతున్న జ్వరాలు తదితర అత్యవసర సందర్భాల్లో ప్రజలు 108 అంబులెన్స్ సేవలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ సుమన్, పైలెట్ రఘుపతి పాల్గొన్నారు.

# రైతులు యూరియ ను ఫ్రేమ్ వర్క్ ఫర్టిలైజర్ ఆప్కాత్త ఆఫ్ లో చేయండి



**నిజామాబాద్ రూరల్ సిరికొండ , ఆగస్టు 05, నేటి శుభోదయ :** తెలంగాణప్రభుత్వం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఇప్పటివరకు అందుబాటులో ఉన్న ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ 06/08/2026. నుండి పని చేయదు.06/08/2026. నుండి భారత ప్రభుత్వం ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చిన ఫ్రేమ్ వర్క్ ఫర్టిలైజర్ ఆప్ అందుబాటులోకి రావడం జరుగుతుంది. సెంట్రల్ ఫర్టిలైజర్ ఆప్ ద్వారా యూరియా, కాంప్లెక్స్ ఎరువులు,డి ఏ పి,ఎస్ ఎస్ పి,పొటాష్ కూడా రైతు నమోదు చేసుకున్న తర్వాతనే సొసైటీ ద్వారా గాని ప్రైవేటు డీలర్ ద్వారా గాని తీసుకోగలుగుతారు. సెంట్రల్ ఫెర్టిలైజర్ ఆప్ లో ఫెర్టిలైజర్ తీసుకోవడానికి రైతు ముఖ్యంగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకొని ఉండాలి. ప్లే స్టోర్ నుండి యాప్ డౌన్లోడ్ చేసుకున్న తర్వాత ఫార్మ్ రిజిస్ట్రీ ఐడి ద్వారా గాని ఆధార్ ద్వారా గాని లాగి అవ్వాలి, రైతు భూమి వివరాలు మరియు పంట వివరాలు నమోదు చేసుకోవాలి. రైతులు అందరూ సెంట్రల్ ఫర్టిలైజర్ యాప్ లో ఎరువులు నమోదు చేసుకోవాలని తెలియజేసారూ మండలంలోని రైతులకు సలహాలు సూచనల కొరకు ఏవో, ఏఈవోలు రైతు వేదికల ద్వారా అందుబాటులో ఉంటాము.అని ఏవో నర్సయ్య తెలిపారు

## ట్రాఫిక్ పునరుద్ధరణకు గ్రీన్ సిగ్నల్



**ఖమ్మం,ఆగస్టు 05, నేటి శుభోదయ :**
జలగంనగర్ – కాల్వొడ్డు మధ్య వున్న మున్నేరు వంతెన వద్ద నీటి ఉధృతి ప్రవహించడం ద్వారా తాత్కాలికంగా నిర్మించిన చప్టలు దెబ్బ తినడంతో వాహనాలు, ప్రయాణికులు ప్రమాదాల భారీన పడకుండా పాత మున్నేరు వంతెన పై ద్విచక్ర వాహనాలను తిరిగి తాత్కాలికంగా పునరుద్ధరించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ట్రాఫిక్ పోలీసులకు ఆదేశించారు.గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని గతంలో పడిన భారీ వర్షాలతో మున్నేరు వద్ద నీటి ఉధృతి ప్రవహించడంతో స్థానిక ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు, ట్రాఫిక్ అంతరాయం, వాహనాలు, ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మున్నేరు ప్రాంతాన్ని సందర్శించి అధికారులకు ముందస్తు పలు సూచనలు చేశారు.

## తల్లిపాలే శిశువుకు తొలి టీకా

- **ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమం**
- **ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ఇటిక్యాల పెంటమ్మ**



**చిన్నంబావి,ఆగస్టు 05, నేటి శుభోదయ :**
చిన్నంబావి మండల పరిధిలోని లక్ష్మీ పల్లి గ్రామంలో అంగన్వాడి సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇటిక్యాల పెంటమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచు ఇటిక్యాల పెంటమ్మ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతపై అందరి చేత ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు గ్రామ సర్పంచ్. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమే కాకుండా అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పించే తొలి వరమని అన్నారు. ప్రతి తల్లి పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించాలని, తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి కుటుంబం అవగాహన పెంచుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలే పునాది అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు మరియు గ్రామ ప్రజలకు ప్రతి ఒక్కరూ తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై వారికి అవగాహన కల్పించి, ఆరోగ్యకరమైన శిశు సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇటిక్యాల పెంటమ్మ, గ్రామ పంచాయతీ సెక్రటరీ, గ్రామ ప్రజా ప్రతినిధులు, అంగన్వాడి టీచర్స్, ఆయాలు, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, బాలింతలు మరియు గర్భిణీలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బంట్వారం మండల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించిన గడ్డం ప్రసాద్ కుమార్







**వికారాబాద్ 05 ఆగస్టు, నేటి శుభోదయ**
వికారాబాద్: బంట్వారం ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును సమీక్షించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల పనితీరుపై వివరాలు అందించగా, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొని మండలానికి సంబంధించిన సమస్యలు, అభివృద్ధి అవసరాలు మరియు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

## సిరికొండలో సమృద్ధిగా వర్షాలు : సాధారణం కంటే 53 శాతం అధిక వర్షపాతంతహసీల్దార్ ఆర్. రవీందర్‌రావు, వెల్లడి



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఆగస్టు 05, నేటి శుభోదయ :** సిరికొండ మండలంలో ఈ వర్షాకాలంలో సాధారణం కంటే అత్యధికంగా వర్షపాతం నమోదైందని తహసీల్దార్ రవీందర్ రావు వెల్లడించారు జూన్, జూలై నెలలతో పాటు ఆగస్టు 4వ తేదీ ఉదయం 8:30 గంటల సమయానికి మండలంలో సాధారణంగా 435.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు ఏకంగా 666.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. ఇది సాధారణం కంటే 53 శాతం అధికమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా తహసీల్దార్ ఆర్. రవీందర్‌రావు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంపై మొదట్లో రైతులు, అధికారులు కొంత ఆందోళన చెందినప్పటికీ, మండలంలో ఎలాంటి ప్రతికూల ప్రభావం పడలేదని ఆనందం వ్యక్తం చేశారు. సిరికొండ మండలంలో సమృద్ధిగా వర్షాలు కురవడం, 53 శాతం అధిక వర్షపాతం నమోదు కావడం ఎంతో శుభపరిణామమని ఆయన అన్నారు.అదేవిధంగా కురిసిన వర్షపు నీటిని ప్రజలు వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకొని, భూగర్భ జల మట్టాన్ని పెంచేందుకు సహకరించాలని తహసీల్దార్ కోరారు.

## నిజాయితీగా పనిచేసేహైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్, సేవలను కొనసాగించాలి : విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం






**ఖమ్మం,ఆగస్టు 05, నేటి శుభోదయ :**
హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ బదిలీ నేపథ్యంలో, ఆయన సేవలను ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కొనసాగించే అంశంపై ప్రభుత్వం అన్ని చట్టపరమైన అవకాశాలను పరిశీలించాలని కోరుతూ విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం సమావేశంలో సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్. రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణ, గౌరవ అధ్యక్షులు ఎస్వీ ప్రతాపరెడ్డి, లావుడియా రాముల నాయక్ (ఎక్స్ ఎమ్మెల్యే), బిళ్ళా అశోక్ కుమార్ విశ్రాంత ఆదనపు ఎస్పి, మరియు ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు అన్నారు. అనంతరం బుధవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తుల పరిరక్షణలో ఎ.వి. రంగనాథ్ నిబద్ధతతో, ధైర్యంగా విధులు నిర్వహిస్తున్నారని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం నిజాయితీగా పనిచేసే అధికారులను ప్రోత్సహించి, వారి సేవలను వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హైకోర్టు పట్ల తమకు పూర్తి గౌరవం ఉందని, న్యాయస్థానం ఆదేశాలను ప్రశ్నించడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేస్తూ,ఏ వి రంగనాథ్ సేవలు ప్రజా ప్రయోజనాలకు అవసరమని, అప్పీల్‌తో సహా అందుబాటులో ఉన్న అన్ని చట్టపరమైన మార్గాలను న్యాయ నిపుణుల సలహాతో పరిశీలించాలని సంఘం కోరింది.ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది.

## నాణ్యమైన నారుతోనే రైతులకు మేలు : జిల్లా ఉద్యాన అధికారి

- **వర్షాభావ పరిస్థితుల్లో మిరప సాగుపై రైతులు పునరాలోచించాలి**
- **రైతుల అవగాహన సదస్సులో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి యం.వి.మధుసూధన్**




**ఖమ్మం, ఆగస్టు 05, నేటి శుభోదయ :** తెలంగాణ ప్రభుత్వం కల్తీ నారును అరికట్టి, రైతులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన నారును అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఉద్యానశాఖ ద్వారా నర్సరీల నమోదు (రిజిస్ట్రేషన్) చేపడుతోందని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్ తెలిపారు. బుధవారం వైరా మండలం సోమవరం గ్రామ రైతు వేదికలో నిర్వహించిన మిరప రైతులు మరియు నర్సరీ యజమానుల అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన, రైతులు పంటల్లో పాటించవలసిన యాజమాన్యం పద్ధతుల గురించి మరియు డ్రిప్ ఇరిగేషన్ యొక్క ప్రాముఖ్యత గురించి అదే విధంగా పంటల్లో వచ్చే చీడపీడలు నివారణ గురించి రైతులకి, నర్సరీ యజమానికి తెలియజేశారు.
ఎల్‌నీనో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు మిరప సాగుపై పునరాలోచన చేసి, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని మాత్రమే సాగు చేపట్టాలని సూచించారు. మిరప సుమారు ఏడు నెలల కాలపరిమితి గల అధిక పెట్టుబడి పంట అని, నాట్లు వేసిన దశ నుంచి కోత పూర్తయ్యే వరకు నిరంతర నీటి అవసరం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వర్షపాతం అనిశ్చితంగా ఉండటం, భూగర్భ జలాల లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో రైతులు విచక్షణతో పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి అవసరం ఉండే ఉద్యాన పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.
వైరా డివిజన్ ఉద్యాన అధికారి డా. ఆకుల వేణు, నర్సరీ యజమానులు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, నాణ్యత లేని నారు విక్రయించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. నర్సరీల నమోదు, నిర్వహణ, నాణ్యత నియంత్రణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అధికారుల ద్వారా నర్సరీ యజమానులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ ఉద్యాన అధికారి డా. ఆకుల వేణు, ఖమ్మం ఉద్యాన అధికారి జి. నగేష్, ఉద్యాన విస్తరణ అధికారి సత్యేంద్ర కుమార్, మిరప నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

## కాకునూరులో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన




**కేశంపేట, ఆగస్ట్ 05, నేటి శుభోదయ :**
ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కేశంపేట మండలం సెక్టార్ పరిధిలోని కాకునూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను అంగన్‌వాడీ సిబ్బంది వివరించారు. పుట్టిన శిశువుకు మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి దగ్గు, జలుబు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు సహా అనేక ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. తల్లిపాల్లో సహజసిద్ధమైన పోషకాలు, యాంటీబాడీలు ఉండటంతో శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుడ్డ రాజు, ప్రధానోపాధ్యాయులు సత్యం, ఉపాధ్యాయులు గీత, ఝాన్సీ రాణి, పద్మ సూపర్వైజర్ పద్మ, అంగన్వాడీ టీచర్లు, వార్డు సభ్యులు వాసు, గ్రామస్తులు జైపాల్ రెడ్డి, బాలింతలు, గర్భిణీలు, మహిళలు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# నగర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకు

- జీజీహెచ్ లో మౌలిక వసతులపై మంత్రికి వినతి.
- ఆర్ వోబీ..ఆర్ యూబీ..నిర్మాణం,బస్ స్టాండ్ ఆధునికీకరణ కోసం మంత్రులను కలిశా
- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



**వికారాబాద్, ఆగస్ట్ 05 ,, నేటి శుభోదయ :** నగర సమగ్రాభివృద్దే లక్ష్యంగా తన ప్రతి అడుగు ఉంటుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు.జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్ళు గడిచినా..నియోజకవర్గ అభివృద్ధి కోసం నయాపైసా ఇవ్వడం లేదన్నారు.నగర మేయర్,కార్పొరేషన్ కమిషనర్ నగరంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఓటమి చెందిన వారికి నిధులు ఇస్తున్నారు తప్ప,ప్రస్తుత ప్రజా ప్రతినిధులకు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు.గతంలో అనేక సార్లు ఆయా శాఖల మంత్రులను కలవడం జరిగిందని గుర్తు చేశారు.నగర అభివృద్ధి కోసం మళ్లీ నలుగురు మంత్రులను కలవడం జరిగిందన్నారు.ప్రధానంగా రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ను కలిసి పలు అంశాలపై వినతి అందజేశానన్నారు.నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోందని,దీనికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా రూ.100 కోట్లతో నాందేవాడ,దేవి రోడ్డు,రైల్వే స్టేషన్ అదనపు వంతెన నిర్మించాలని ప్రతిపాదించినట్లు చెప్పారు.అలాగే రూ.70 కోట్లతో ఎల్లమ్మ గుట్ట రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరానన్నారు.అలాగే వర్ని,నిజామాబాద్,డిచ్పల్లి,ఇందల్వాయి,భీమ్గల్,కమ్మర్పల్లి వరకు నగరం మీదుగా 107 కిలోమీటర్ల కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనలు కూడా అందించినట్లు పేర్కొన్నారు.నగరంలోని రేడియో స్టేషన్ నుంచి ముదక్పల్లి వరకు రోడ్డు భవనాల రహదారి అభివృద్ధి కూడా అవసరమని వివరించినట్లు పేర్కొన్నారు.ఇందూరులోని టీ హబ్ ద్వారా యువతకు ప్రముఖ ఎంఎన్ సీ కంపెనీలు తీసుకురావాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కలిసినట్లు చెప్పారు.ఇందూరు యువతలో ప్రతిభకు కొదవలేదని,ఉద్యోగ అవకాశాల కోసం హైదరాబాద్,బెంగళూరు,పూణే వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.యువతను నగరాలకు పంపడం కాదని,ఉద్యోగాలను నిజామాబాద్ కు తీసుకురావాలని అన్నారు.జిల్లా జనరల్ ఆస్పత్రి సమస్యలను సమగ్రంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహని కలిసి వివరించినట్లు తెలిపారు.ఎమ్మారై యంత్రం ఇప్పటికీ లేకపోవడం,మార్చురీ ఫ్రీజర్ల కొరత,లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ లేకపోవడం ప్రధాన సమస్యలన్నారు.అలాగే సివిల్ సర్జన్,ఆర్ ఎంఓ లు,క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ల ఖాళీలు భర్తీ చేయాలని కోరారు.పేదల ప్రాణాలను కాపాడే ఆసుపత్రిలో సౌకర్యాల కొరత ఉండకూడదని,ప్రజల ఆరోగ్యం పై రాజీపడే పరిస్థితి ఎప్పుడు ఉండకూడదు అన్నారు.తెలంగాణలోని ప్రధాన నగరాల్లో ఒకటైన నిజామాబాదు బస్టాండులో పెరిగిన రద్దీకి తగిన సౌకర్యాలు లేకపోవడం శోషనీయమని అన్నారు.ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి అందజేసినట్లు చెప్పారు.గతంలో స్థలానికి సంబంధించి వినతి పత్రం కూడా అందజేసినట్లు గుర్తు చేశారు.ప్రస్తుతం ఉన్న బస్టాండ్కు విశాలమైన వేచి ఉండే హాలు,సిట్టింగ్ కెపాసిటీ పెంపు,డిజిటల్ బస్సు ఇన్ఫర్మేషన్ బోర్డులు,ఎల్ఈడి స్క్రీన్లు,సీసీ కెమెరాలు,పార్కింగ్ సదుపాయం పరిశుభ్రత వంటి అంశాలపై వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో నిజామాబాద్ అభివృద్ధిని వేగవంతం చేయాలన్నదే తన ప్రయత్నమని అర్బన్ ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఇందుకోసం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి రైల్వే శాఖకు సంబంధించిన అనేక ప్రతిపాదనలు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు అందజేసినట్లు చెప్పారు.సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ,పోతన్కర్ లక్ష్మీనారాయణ,ఫ్లోర్ లీడర్ ప్రమోద్,కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్,జ్యోతి మురళి,శ్యామల సత్యపాల్,బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్,బంటు ప్రీతి ప్రవీణ్,ప్రసూన శ్రీనివాస్,ఇప్పకాయల సుమిత్ర కిషోర్,పసునూరి రాము,బట్టు రాఘవేందర్,ఎస్సీ మోర్చ నాయకులు జస్పాల్ సింగ్,బాబీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య దూరతండాలో బోరు మోటర్ ప్రారంభం



**కేశంపేట, ఆగస్ట్ 05, నేటి శుభోదయ :** కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామపంచాయతీ పరిధిలోని బాల్య దూరతండాలో డీఎంఎఫ్టీఏ నిధులతో మంజూరైన 5 హెచ్పీ సమర్సబుల్ బోరు మోటర్ను గ్రామ డిప్యూటీ సర్పంచ్ ఉత్యావత్ రవి నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి తండాకు తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.బాల్య దూరతండాలో నెలకొన్న తాగునీటి సమస్యను గ్రామ సర్పంచ్ కవితా కరుణాకర్ రెడ్డి షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి డీఎంఎఫ్టీఏ నిధుల ద్వారా బోరు మోటర్ మంజూరు చేయించారని తెలిపారు. దీంతో తండావాసుల తాగునీటి సమస్యకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.బోరు మోటర్ మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్తో పాటు మండల కాంగ్రెస్ నాయకులకు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈ బాలు, ఏఈ నరేష్ రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, బీసీ కరుణాకర్ రెడ్డి, వార్డు సభ్యులు లచ్చిరామ్ నాయక్, చెన్నయ్య, అంజి నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి సిపిఐ ప్రజా చైతన్య యాత్ర

- తల్లంపాడు హైవే జంక్షన్ వద్ద ప్రారంభం
- ప్రభుత్వ వైఫల్యాలు వివరించి జనచైతన్య మే లక్ష్యం



**ఖమ్మం, ఆగస్ట్ 05, నేటి శుభోదయ :** భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్రజా చైతన్య పాద యాత్రలను నిర్వహించనున్నారు గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు హైవే జంక్షన్ వద్ద పాదయాత్రను సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రారంభించనున్నారు ఆరో తేదీ నుంచి 13వ తేదీ వరకు 20 మండలాల్లో ఈ పాదయాత్రలు నిర్వహించనున్నట్లు జిల్లా సమితి తెలిపింది కేంద్ర ప్రభుత్వం ప్రజలను విస్మరించి పాలను సాగిస్తున్నదని మోడీ పాలన వైఫల్యాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో ప్రజా చైతన్య యాత్రలను నిర్వహిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు కార్పొరేట్ అనుకూల పాలనలో భాగంగా అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి విబిజి రాంజీ పథకాన్ని తీసుకువచ్చిందని దీని రద్దు కోసం సిపిఐ పోరాడుతుందన్నారు వి బి జి రామ్ జి స్తానే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యధాతథంగా అమలు చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందని సురేష్ తెలిపారు వ్యవసాయ రంగాన్ని పరిరక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్లకు అంటగట్టే ప్రయత్నం చేస్తుందని ఈ క్రమంలోనే ట్రంప్ తో ఒప్పందాలు వ్యవసాయ సబ్సిడీలు ఎత్తివేత పెట్టుబడికి తగిన విధంగా మద్దతు ధరలు ప్రకటించకపోవడం చేస్తున్నారని ఆయన ఆరోపించారు నూతన సాగు చట్టాల పేరుతో రైతులను భూమి నుంచి తరిమే ప్రయత్నం చేస్తున్నదని సురేష్ ఆరోపించారు కార్మిక చట్టాలను రద్దుచేసి దాని స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని నాలుగు లేబర్ కోడ్స్ ద్వారా పని గంటలను పెంచారని ఆయన తెలిపారు దేశంలో ఆర్థిక పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారుతున్నాయని పెరుగుతున్న ఆర్థిక అంతరాలు భవిష్యత్తులో ఓ సవాలుగా పరిణమించనున్నాయన్నారు వీటిని అన్నింటిని ప్రజలకు వివరించి చైతన్య పరిచేందుకు పాదయాత్రలు నిర్వహిస్తున్నామన్నారు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తుందని ఈ విషయాన్ని సైతం ప్రజల్లోకి తీసుకు పోతామని సురేష్ స్పష్టం చేశారు రుణమాఫీ ఇందిరమ్మ ఇండ్లు తదితర విషయాల్లో పూర్తిస్థాయి అమల్లో విఫలమైందని మరికొన్నింటి విషయంలో అడుగు కూడా ముందుకు పడలేదన్నారు పాదయాత్రల ద్వారా చైతన్యం తీసుకువచ్చే క్రమంలో పలుచోట్ల సభలు నిర్వహించనున్నట్లు సురేష్ తెలిపారు ఖమ్మంలో ఈ నెల 13న జరిగే బహిరంగ సభతో పాదయాత్రలు ముగుస్తాయని సురేష్ తెలిపారు

# విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్న ప్రభుత్వం

**ఖమ్మం,ఆగస్ట్ 05, నేటి శుభోదయ :** విద్యార్థుల విద్యా సంవత్సరం పూర్తి చేసి కొత్త కోర్సులు చేరేందుకు కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకునేందుకు వచ్చిన వారికి ఫ్లీజ్ రియంబర్స్మెంట్ విద్యార్థులకు చెల్లించకపోవడంతో సర్టిఫికెట్లను ఇచ్చేందుకు విద్యా సంస్థ లు నిరాకరిస్తున్నాయి. వారు కళాశాలలో చేరే అప్పుడు అధికారంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఉండేది తర్వాత విద్య పూర్తి చేసుకున్న తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఆ ప్రభుత్వంలో ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించకపోవడంతో ఈ ప్రభుత్వం ఫీజు బకాయిలను దశలవారిగా చెల్లిస్తామని చెప్పటంతో ముఖ్యంగా విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యా సంస్థలకు మూడు సంవత్సరాల నుండి గత ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు చెల్లించే బకాయిలు కళాశాలకు ఎక్కువ కావడంతో కొంత మొత్తమైన కట్టమని కళాశాలలో విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. అటు కళాశాల యాజమాన్యం ఎటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త కోర్సులు చేరే విద్యార్థులు సర్టిఫికెట్లు ఇవ్వటంలో కళాశాల జాప్యం చేయడంతో పై చదువులు చదివేందుకు అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క విద్యార్థులే కాదు కళాశాల యాజమాన్యం జీతభత్యాల చెల్లింపు కళాశాల నిర్వహణ లో ఇబ్బందులకు గురవుతున్నారు. డబ్బులు బయట లోన్స్ తెచ్చి జీతభత్యాలను చెల్లిస్తున్నారు. కొందరు కళాశాల యాజమాన్యం వారు కరాకండిగా ఫ్లీజ్ రిమాండ్స్ మెంట్ మొత్తం బకాయిలు ప్రభుత్వం చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతున్నారు. నీకు అత్యవసరమైతే ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకొని పోవచ్చని గవర్నమెంట్ తమ ఖాతాల్లో వేసిన తర్వాత మీకు తిరిగి తెలుస్తామని చెబుతున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కొత్తగా పడుతున్న కొలువులకు తోపాటు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందాలన్నా సర్టిఫికెట్లు అవసరం ఎంతైనా ఉంది. ఒక్కొక్కరు మూడు సంవత్సరాల బకాయిలు ప్రభుత్వం చెల్లించకుండా ఉండటంతో విద్యార్థులకు కొన్ని వేల రూపాయలు కళాశాలకు చెల్లించిన అవసరం ఉంది. ప్రభుత్వం సైతం మేము అధికారంలో వచ్చిన కాబట్టి మా హయాంలో నీ ఫ్లీజ్ రియంబర్స్మెంట్ తెలుస్తామని గత ప్రభుత్వం చెల్లించాల్సింది వెసులుబాటును బట్టి చెల్లిస్తామని చెబుతుంది. కొన్ని వేల కోట్ల బకాయిల వల్ల విద్యార్థులు తీవ్ర నష్టం అయిపోతున్నారు. దీనికి పరిష్కారం ప్రభుత్వమే యోచించాలి. ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ బడ్జెట్ విడుదల చేస్తున్న అది స్వల్పంగా ఉండటం వల్ల సరిపోని పరిస్థితి ఏర్పడుతుంది. కొందరు కళాశాల యాజమాన్యం వారు సహృదయంతో పూచికత్తులు తీసుకొని విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇస్తున్నారు. ఫీజు రీఎంబర్స్మెంట్ విషయంలో కొత్త నిబంధనలు పెట్టి విద్యార్థుల ఖాతాలోనే ఫీజు రియంబర్స్మెంట్ పడేవిధంగా ప్రభుత్వం యోచిస్తుంది ఎస్ ఎస్ సి ఎస్ టి వారికి నేరుగా ఫ్లీజ్ వారి ఖాతాలో పడుతుంది. దీని మూలంగా కళాశాల వారు విద్యార్థులు ని తిరిగి వసూలు చేసుకుని ఎందుకు తల ప్రాణం తోకకు వచ్చే అవకాశం ఉంది. కొందరు ఇవ్వకుండా జాప్యం చేస్తూ కొందరు కావాలని ఇవ్వకుండా కళాశాలలపై నిందలు వేసే అవకాశం కూడా ఉంది. చాలామంది విద్యార్థులు కోర్సులు పూర్తయిన ఏళ్ల తరబడిగా డబ్బులు చెల్లించలేక స్తోమత ఫీజు రియంబర్స్మెంట్ పడ్డాకనే తీసుకుందామని కష్టాల కటగంట్లలో ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థి సంఘాలు బీసీ నాయకులు సంఘాలు ఎప్పటికప్పుడు ధర్నాలు చేస్తున్న చెల్లింపు విషయంలో పురోగతి కనిపించడం లేదు అయినప్పటికీ విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థి సంఘాలు బీసీ సంఘాలు తమ వంతు కర్తవ్యం గా ఫీజు రీయింబర్స్మెంట్ విషయంలో పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తున్నాయి ప్రభుత్వం ఏ మేరకు చొరవ చూపి తక్షణంగా చర్యలు తీసుకొని విద్యార్థులను ఆదుకోవాలని విజ్ఞప్తులు వెల్లి వెళుతున్నాయి. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిన అవసరం ఉంది

# ఘనంగా పోచమ్మ బోనాలు



**షాబాద్, ఆగస్ట్ 05, నేటి శుభోదయ :** షాబాద్ మండలానికి సంబంధించిన జ్యోతిబాపూలే గురుకుల బాలికల కళాశాల,పాఠశాలలో బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలారావతి మాట్లాడుతూ... తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు, పండుగ విశిష్టతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను పోతురాజుల వేషధారణ వేసి అలరించారు. ఈ కార్యక్రమంలో ఏ టి పి సరోజ, శైలజ,ఉపాధ్యాయునిలు, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు

## ప్రధాన రోడ్డుపై సంతతో ట్రాఫిక్ అవస్థలు.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?



**వికారాబాద్, 05 ఆగస్టు, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: కుల్కచర్ల–మరికల్ ప్రధాన రోడ్డుపై ప్రతి బుధవారం నిర్వహిస్తున్న వారాంతపు సంత స్థానికులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్డుపైనే రైతులు, వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతూ తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికే ఇరుకైన సీసీ రోడ్డుపై సంత నిర్వహించడం వల్ల అత్యవసర సేవల వాహనాలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెబుతున్నారు.సంత కారణంగా ప్రమాదాలకు అవకాశం పెరుగుతోందని, ఒకవేళ ప్రమాదం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారనే ప్రశ్నను స్థానికులు లేవనెత్తుతున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తినప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక చర్యలకే పరిమితమవుతున్నారని, శాశ్వత పరిష్కారంపై మాత్రం దృష్టి పెట్టడం లేదని ఆరోపిస్తున్నారు.సంత నిర్వహణ కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రధాన రోడ్డుపై జరుగుతున్న సంతను వెంటనే అనువైన ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించాలని స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

## వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం కంటే ఆయన ఆశయాలు గొప్పవి




**షాద్నగర్ ,ఆగస్టు 5 , నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చేపట్టిన చౌరస్తా విస్తరణ పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు విశేష సహకారం అందించారు. ప్రజాహితమే పరమావధిగా భావిస్తూ, చౌరస్తాలో ప్రతిష్ఠించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని స్వచ్ఛందంగా తొలగించేందుకు కాంగ్రెస్ నాయకులు ముందుకు రావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.మున్సిపల్ అధికారులు సాయంత్రం విగ్రహాన్ని తొలగించే ప్రక్రియ చేపట్టగా, ఆ సమయంలో విగ్రహం అనుకోకుండా రెండు భాగాలుగా విరిగిపోయింది. ఈ దృశ్యాన్ని చూసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తమ అభిమాన నాయకుడి విగ్రహం ఈ స్థితికి చేరడం బాధాకరమే అయినప్పటికీ, పట్టణ ప్రజల సౌకర్యం, అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి నిలిచారు."నాయకుడి విగ్రహం కంటే ఆయన ఆశయాలు గొప్పవి. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా విగ్రహం ఉండకూడదనే భావనతో అభివృద్ధికి సహకరించాం" అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాల ముందు రాజకీయాలను పక్కనబెట్టి సహకరించిన కాంగ్రెస్ పార్టీ వైఖరిని పలువురు అభినందిస్తున్నారు.పట్టణాభివృద్ధికి ఆటంకం కాకుండా స్వచ్ఛందంగా ముందుకొచ్చిన కాంగ్రెస్ నాయకత్వం ప్రజాహితానికి ప్రాధాన్యం ఇచ్చిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. "ప్రజల అభివృద్ధే అసలైన నివాళి" అనే సందేశాన్ని కాంగ్రెస్ పార్టీ ఈ చర్య ద్వారా మరోసారి చాటిందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి..

## బీఆర్ఎస్ అసత్య ప్రచారంతో రైతులను మభ్యపెట్టే ప్రయత్నం.. అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలు సాగవు : శ్రీనివాస్ ముదిరాజ్



**వికారాబాద్, 05 ఆగస్టు, నేటి శుభోదయ :** వికారాబాద్: వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో పూర్తి చేసే దిశగా పాలక మండలి కార్యాచరణతో ముందుకు సాగుతోందని ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం నిర్మిస్తామని చెప్పి మార్కెట్‌లో ఉన్న షెడ్లు, మరుగుదొడ్లు, నీటి కుళాయిలను పూర్తిగా తొలగించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. నిర్మాణ పనులు తొలి దశలోనే నిలిచిపోవడంతో మార్కెట్‌లో కనీస వసతులు లేక రైతులు, వ్యాపారులు ఎన్నో సంవత్సరాలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో మార్కెట్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. మినరల్ వాటర్ ప్లాంట్, నూతన మరుగుదొడ్లు, బోర్‌వెల్, కూరగాయల విక్రయదారుల కోసం ఆధునిక కవర్ షెడ్డు నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించామని, ప్రస్తుతం అవి టెండర్ దశలో ఉన్నాయని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభించి రైతులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు.ఎలాంటి ఆధారాలు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలతో బీఆర్ఎస్ నాయకులు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారని, రైతుల సంక్షేమం, మార్కెట్ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులతో కాంగ్రెస్ పార్టీ చరిత్రలో నిలిచిపోతుందని ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, వైస్ చైర్మన్ మల్లేశం పేర్కొన్నారు.

## గెస్ట్ హౌస్ శిలాఫలకానికి రెండేళ్లు.. నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

**వికారాబాద్, 05 ఆగస్టు, నేటి శుభోదయ :** వికారాబాద్: వికారాబాద్ పట్టణంలో నాలుగు సూట్ల గెస్ట్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, పూర్తికాని నిర్మాణానికి ప్రతీకగా ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిలాఫలకానికి పూలమాల వేసి, అగర్బత్తీలు వెలిగించి, టెంకాయ కొట్టి, పూలు చల్లి, కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మెతుకు ఆనంద్ మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడాల్సిన నాలుగు సూట్ల గెస్ట్ హౌస్ నిర్మాణం శంకుస్థాపన చేసి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ పూర్తికాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజల సొమ్ముతో ప్రారంభించిన




అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోవడం బాధాకరమని అన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలు శిలాఫలకాలకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపించాలని పేర్కొన్న ఆయన, ప్రస్తుత ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ వెంటనే స్పందించి గెస్ట్ హౌస్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి



చేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ఆయన అన్నారు.

## నేటి నుంచి ఎఫ్.ఎఫ్.ఎస్. యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు : జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య

- **ఖమ్మం జిల్లాలో తొలి దశలో కేంద్ర ప్రభుత్వ నూతన ఎఫ్.ఎఫ్.ఎస్. యాప్ అమలు**
- **ఫార్మర్ ఐడీ లేదా ఆధార్‌తో అన్ని వర్గాల రైతులకు ఎరువుల కొనుగోలు సౌకర్యం**

**ఖమ్మం, ఆగస్ట్ 05, నేటి శుభోదయ :** కేంద్ర ప్రభుత్వం రూపొందించిన "ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్)" నూతన యాప్ ద్వారా నేటి (ఆగస్టు 6) నుంచి ఖమ్మం జిల్లాలో ఎరువుల విక్రయాలు నిర్వహించ నున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇప్పటివరకు అమలులో ఉన్న ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎఫ్.ఎఫ్.ఎస్. యాప్ అమలులోకి వస్తోందని, తొలి దశలో ఖమ్మం జిల్లాను ఈ నూతన వ్యవస్థకు అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 6 నుంచి జిల్లాలోని అన్ని రీటైల్ ఎరువుల దుకాణాల్లో యూరియా, డి.ఎ.పి., పొటాష్‌తో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులను ఎఫ్.ఎఫ్.ఎస్. యాప్ ద్వారానే కొనుగోలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ఈ యాప్ ద్వారా పట్టాదారు రైతులు, ఎన్‌డీఎస్ రైతులు, కౌలు రైతులు తమ ఫార్మర్ ఐడీ లేదా ఆధార్ నంబర్ ఆధారంగా ఎరువులను బుక్ చేసుకుని కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. జిల్లాలోని ఏ మండలంలోనైనా రైతులు తమకు అవసరమైన ఎరువులను కొనుగోలు చేసుకునే సౌకర్యం ఈ యాప్ ద్వారా అందుబాటులో ఉంటుందని తెలిపారు.రైతులకు ఎరువుల బుకింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, క్లస్టర్ స్థాయి సిబ్బంది, ఎరువుల డీలర్లు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.ఎరువుల బుకింగ్ లేదా కొనుగోలు సమయంలో రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి లేదా జిల్లా వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.అలాగే ఇప్పటివరకు అమలులో ఉన్న యూరియా యాప్ టోల్ ఫ్రీ నంబర్ 1800–123–7157 నూతన ఎఫ్.ఎఫ్.ఎస్. యాప్ కు కూడా కొనసాగుతుందని, ఫిర్యాదులు లేదా సాంకేతిక సమస్యలు ఉంటే ఆ నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులతో సమావేశం

**ఖమ్మం,ఆగస్ట్ 05, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులతో బుధవారం హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, మట్ట రాగమయి దయానంద్, ఖమ్మం డీసీసీ అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.సమావేశంలో త్వరలో ఖాళీ కానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై విస్తృతంగా చర్చించారు.పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా ఇంచార్జ్ మంత్రులు సంబంధిత ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరిస్తున్న నేపథ్యంలో, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశావహుల వివరాలు,



ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పేర్లను పీసీసీకి పంపించాలని సమావేశంలో నిర్ణయించారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆశావహుల వివరాలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన వారి వివరాలను పీసీసీకి పంపాలని నిర్ణయం తీసుకున్నారు.

# ఎస్ఐఆర్‌కు కేవలం ఐదు రోజులే గడువు

- ఆగస్టు 10లోపు ఎన్యుమరేషన్ ఫారాలు నింపి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోండి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 5, నేటి శుభోదయ :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి ఆగస్టు 10తో గడువు ముగియనుంది.ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు వెంటనే సంబంధిత బి ఎల్ ఓలకు ఫారాలు అందజేయాలి.ఓటరు జాబితాలోని పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలి.జిల్లా వ్యాప్తంగా వీఆర్వోలు, ఏఈఆర్ ఓలు, బిఎల్ఓలు ప్రజలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు.ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి పౌరుడు

బాధ్యతతో వ్యవహరించాలి.భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమానికి కేవలం ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందని, జిల్లాలోని అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆగస్టు 10వ తేదీలోపు తమ ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత బూత్ లెవల్ అధికారులకు బి ఎల్ ఓలు తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో,తప్పులులేకుండా రూపొందించేందుకు ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు భాగస్వామి కావాల్సిన అవసరం ఉందని, ఎన్నికల సంఘం కల్పించిన అదనపు గడువును ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే తమ పరిధిలోని బూత్ లెవల్ అధికారిని బి ఎల్ ఓ సంప్రదించి పూర్తి వివరాలతో ఫారాలను సమర్పించాలని తెలిపారు. అసంపూర్ణంగా లేదా తప్పుగా నింపిన ఫారాల వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, అవసరమైన అన్ని వివరాలను స్పష్టంగా నమోదు చేసి సమర్పించాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు కూడా తమ వివరాలను ఒకసారి తప్పనిసరిగా పరిశీలించుకోవాలని తెలిపారు. పేరు, ఇంటి చిరునామా, వయస్సు, లింగం, కుటుంబ వివరాలు లేదా ఇతర సమాచారంలో ఏవైనా తప్పులు ఉంటే వాటిని గడువులోపు సరిదిద్దించుకోవాలని సూచించారు. అవసరమైతే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి వీఆర్వో ,సహాయ ఎన్నికల నమోదు అధికారి ఏఈఆర్వో లేదా బూత్ లెవల్ అధికారిని సంప్రదించి సవరణలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రజలకు అవసరమైన మార్గదర్శకాలు, సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఎన్నికల నమోదు అధికారులు ఈ ఆర్ వోలు,సహాయ ఎన్నికల నమోదు అధికారులు ఏ పి ఆర్ ఓలు,బూత్ లెవల్ అధికారులు బి ఎల్ ఓలు కార్యాలయ వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫారాల స్వీకరణ, సందేహాల నివృత్తి, సవరణల ప్రక్రియలో సహకరిస్తున్నారని తెలిపారు.

ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకుండా భారత ఎన్నికల సంఘం జారీ చేసిన అధికారిక మార్గదర్శకాలను మాత్రమే అనుసరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గడువు ముగిసే వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించడం ద్వారా చివరి నిమిషంలో రద్దీని నివారించవచ్చని చెప్పారు.«"ఎస్ఐఆర్ కార్యక్రమానికి కేవలం ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకం. ప్రతి ఓటరు తన వివరాలను ఒకసారి పరిశీలించి, అవసరమైతే సవరణలు చేయించుకోవడంతో పాటు ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు ఆగస్టు 10వ తేదీలోపు తప్పనిసరిగా సమర్పించాలి. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలి."» అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా ప్రజలకు సూచించారు.కార్యక్రమం: ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ ,గడువు: 10 ఆగస్టు 2026,ఎవరికి జిల్లాలోని అర్హులైన ఓటర్లందరికీ చేయాల్సింది.ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించడం, ఓటరు వివరాలు పరిశీలించడం, అవసరమైన సవరణలు చేయించుకోవడం.సంప్రదించవలసిన వారు బి ఎల్ ఓలు, వీఆర్వోలు, ఏ ఈ ఆర్ వోలు,విజ్ఞప్తి: చివరి రోజు వరకు వేచి ఉండకుండా వెంటనే ప్రక్రియ పూర్తి చేయాలి.

# నిధులు, నియామకాలు, సామాజిక న్యాయం దిశగా ఉద్యమించాలి

- జిల్లాలో టీజేఎస్ ను క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయండి
- టీజేఎస్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ ప్రో.కోదండరామ్





**ఖమ్మం, ఆగస్టు 5, నేటి శుభోదయ :** తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నిధులు,నియమాకాలు, నీళ్లు, సామాజిక న్యాయం దిశగా ఉద్యమించాలని తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ ప్రో.కోదండరామ్ సూచించారు. టీజేఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గా ఎన్నికైన మాదాసు శ్రీనివాసరావు హైద్రాబాద్ లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ను ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడారు..ఖమ్మం జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతం బూత్ కమిటీ నుంచి మండలం, పట్టణాలలో అన్ని కమిటీలు పూర్తి చేయాలని సూచించారు. సామాజిక న్యాయం దిశగా జన సమితి జెండా కింద ప్రజలను ఏకం చేయాలని సూచించారు. పార్టీని క్షేత్ర స్థాయిలో తిరుగులేని శక్తి గా నిలపాలని సూచించారు. జిల్లాలో పార్టీని బహుజన ప్రజా ఉద్యమాల వేదికగా తీర్చిదిద్దటానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని నూతన అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాక్షుడు అంబటి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్కుమార్, గోపగాని శంకర్రావు, మేకపోతుల నర్సయ్య, జిల్లా నాయకులు మందడి వెంకటేశ్వరరావు, తీగ రాములు, మోహన్రావు, నాగేశ్వరరావు, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గడపపైనా మువ్వన్నెల జెండా రెపరెపలాడాలి

- ఉద్యమ స్ఫూర్తితో 'హర్ ఘర్ తిరంగా'ను విజయవంతం చేయాలి
- బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు



**ఖమ్మం, ఆగస్టు 5, నేటి శుభోదయ :** దేశభక్తిని చాటే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ప్రతి గడపకూ ఈ జాతీయ స్ఫూర్తిని తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కన్వీనర్ వేల్పుల సుధాకర్ అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు జరుపుకుంటున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఒక ఉత్సవం మాత్రమే కాదు, అదొక పవిత్రమైన జాతీయ బాధ్యత. మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, జాతి ఐక్యతను చాటిచెప్పే ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ఖమ్మం జిల్లాలోని ప్రతి పల్లె, ప్రతి వాడలో మువ్వన్నెల జెండా సగర్వంగా ఎగరాలి. పార్టీ శ్రేణులు, నాయకులు అహర్నిశలు శ్రమించి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని నింపాలి. ఈ కార్యక్రమాన్ని కేవలం ఒక రాజకీయ కార్యక్రమంగా కాకుండా, ప్రజలందరి పండుగలా మలచాలి" అని ఆయన శ్రేణులకు ఉద్వేగభరితంగా పిలుపునిచ్చారు.అనంతరం ఈ సమావేశంలో పాల్గొన్న బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, హర్ ఘర్ తిరంగా వరంగల్ జోన్ కన్వీనర్ గల్లా సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు విద్యాసాగర్ జెంటేల, డోకుపర్తి రవీంద్ర కుమార్ తదితరులు మాట్లాడుతూ... క్షేత్ర స్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలపై అద్భుతమైన మార్గదర్శనం చేశారు. దసరా, దీపావళి లాంటి పండుగలకు ఏ విధంగా అయితే సిద్ధమవుతామో, ఈ జాతీయ పండుగను కూడా అంతే ఘనంగా నిర్వహించాలని, యువతను, మహిళలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేస్తూ జాతీయవాదాన్ని ఉరకలెత్తించాలని వారు సూచించారు.ఈ చరిత్రాత్మక సన్నాహక కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా ఖమ్మం జిల్లా కో-కన్వీనర్లు కళ్లెం విజయ రెడ్డి, అనంతు ఉపేందర్ రావు, దీకొండ శ్యామ్ సుందర్ విశేషంగా పాలుపంచుకుని తమ వంతు బాధ్యతలను వివరించారు. వీరితో పాటు పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వీరయ్య, రాజేష్, రవి రాథోడ్, వివిధ మోర్చాల అధ్యక్షులు నరుకుల వెంకటేశ్వర్లు, ఆర్. వి. ఎస్. యాదవ్, మంద సరస్వతి, శ్రీరామనేని మనీ, సుదర్శన్, అల్లిక అంజయ్య, కందుల శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంపంగి మద్దిలేటి 48వ జన్మదిన వేడుకలు





**వనపర్తి, ఆగష్టు-05 , నేటి శుభోదయ :** చిన్నంబావి మండల పరిధిలోని లక్ష్మి పల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంపంగి మద్దిలేటి 48వ జన్మదిన వేడుకలు చిన్నంబావి మండల చౌరస్తాలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు దేవుని రమేష్ మాదిగ, వడ్డేమాన్ రామకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ తగరం కుర్మయ్య, తగరం ఆటో కుర్మయ్య, తగరం కాన్షిరం, సంకటి మద్దిలేటి, బాల వెంకట్, వై స్వామి, చిన్న మద్దిలేటి, కాకునూరు కృష్ణ, మేస్త్రి వెంకటస్వామి, డ్రైవర్ వెంకట్, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంపంగి మద్దిలేటి మంద కృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడుస్తూ మాదిగ దండోరా సంఘానికి సేవ చేస్తూ సమాజ సేవలో అందిస్తున్న సేవలను నాయకులు కొనియాడుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమం సందర్భంగా హర్షాతిరేకాల మధ్య జన్మదిన వేడుకలు సందడిగా జరిగాయి.ఈ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు మరియు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొని సంపంగి మద్దిలేటి 48వ పుట్టిన రోజు శుభాకాంక్షలు

# మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మోత్కూరి శ్రీనివాస్

## - ప్రధాన కార్యదర్శిగా గడిపెల్లి అజయ్ ఏకగ్రీవ ఎన్నిక







**మంథని, ఆగష్టు-05 , నేటి శుభోదయ :** మంథని డివిజన్ ప్రెస్ క్లబ్( వర్కింగ్ జర్నలిస్టులు ) అధ్యక్షునిగా మోత్కూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గడిపెల్లి అజెయ్ లు ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన ఎన్నికల్లో ముఖ్య సలహాదారుగా కొట్టె రవీందర్, అధ్యక్షులుగా మోత్కూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నాగెపల్లి రాజబాబు, కాట వినయ్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గడిపెల్లి అజెయ్, కోశాధికారిగా మాదర బోయిన కిషన్, సంయుక్త కార్యదర్శిగా ఆకుల వేణు, అనంతుల సంతోష్, సహాయ కార్యదర్శిగా అసంపల్లి స్వామి, రేణిగుంట్ల రమేష్, కార్యవర్గ సభ్యులుగా మాడిశెట్టి సంతోష్, జనగామ సద్వల్, అరిగేల నారాయణ గౌడ్, సిలివేరి సందీప్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# బోనాల ఉత్సవాలు భక్తి సంప్రదాయాలకు ప్రతీక

## : రవీందర్ యాదవ్



**కేశంపేట,ఆగష్టు-05, నేటి శుభోదయ :** కేశంపేట మండలం సంగెం గ్రామంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు.బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న రవీందర్ యాదవ్‌కు గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. గ్రామంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వేణుగోపాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, ఉప సర్పంచ్ శకీల్, మాజీ ఎంపీటీసీ యాదగిరి, సర్పంచ్ రామకృష్ణ, నాయకులు బల్వంత్ రెడ్డి, భగవాన్ రెడ్డి, జమాల్ ఖాన్, పుండరీకం గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, యాదగిరి, సలీం, అనిల్ గౌడ్, మన్సూర్, వంశీ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేశారు.

# కొత్తూరు మున్సిపాలిటీలో చెత్త శుద్ధి ఏది?

- పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు పట్టించుకోని అధికారులు
- గాడి తప్పిన స్వచ్ఛత.. కంపుకొడుతున్న కాలనీలు
- డంపింగ్ యార్డుల్లా మారుతున్న వైనం
- దోమలు,ఈగలు స్వైరవిహారం అనారోగ్యం బారిన కాలనీ ప్రజలు





**షాద్నగర్, ఆగస్టు 5 , నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజక వర్గం పరిధిలోని కొత్తూరు గ్రామంలో చెత్త నిర్వాహన అధ్వానంగా మారింది కొత్తూర్ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేశారు కొత్తూర్ మున్సిపాలిటీగా మారిన మున్సిపాలిటీ వ్యవస్థ మారలేదు కొత్తూరు మున్సిపల్ అధికారులు సిబ్బంది పర్యా వేక్షణ లేకపోవడంతో భారీగా చేరిన చెత్త కుప్పల నుండి దుర్గంధముగా మారాయి కొత్తూరు లోనే వివిధ కాలనీలో చెత్తను స్వీకరించడం సిబ్బంది సేకరించడం మరిచారు గత రెండు రోజుల నుండి చెత్త నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది స్వచ్ఛత గాడి తప్పింది.. ఎక్కడ చూసినా..చెత్త కుప్పలే దర్శమిస్తున్నాయి..పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో కాలనీలు డంపింగ్ యార్డులను తలపిస్తూ..కంపు కొడుతున్నాయి. దుర్వాసన,రోగాలతో జనం అవస్థలుపడుతున్నారు.ఎన్ని స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టినా.. కాగితాల్లో ఎన్ని జీవీపీ పాయింట్లు ఎత్తివేసినట్లు చూపుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఎకడ వేసిన గొంగళి అకడే అన్నట్లు ఉంది. చెత్తశుద్ధిలో చిత్తశుద్ధి కరువుతున్నది.ఫలితంగా కొత్తూరు మున్సిపాలిటీలో రోగాలు విజృంభిస్తున్నాయి. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని పోలీస్ స్టేషన్ కాలనీలో గత వారం రోజుల నుండి చెత్త వెహికల్స్ రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎక్కడ చెత్త అక్కడే ఉండడంతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు.వెంటనే మున్సిపల్ కమిషనర్ గారు స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. అలాగే రైల్వే స్టేషన్ రోడ్ లో డ్రైనేజీ పొంగిపొర్లుతున్న పట్టించుకోవడం లేదు. వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు

# సేవాలాల్ సేవే నా మార్గం... అంబేద్కర్ ఆలోచన దిశగా నా ప్రయాణం --- భాస్కర్ నాయక్



**మిడ్జిల్ ఆగస్టు 5, నేటి శుభోదయ :** జడ్చర్ల నియోజకవర్గంలో సామాజిక సేవతో ప్రజలకు చేరువైన నాయకుడిగా జర్పుల భాస్కర్ నాయక్ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ఆదివాసీల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ బోధించిన సేవా తత్వాన్ని ఆచరిస్తూనే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, స్వాభిమాన ఆశయాలను తన ప్రజా జీవితానికి మార్గదర్శకంగా తీసుకుని ముందుకు సాగుతున్నానని భాస్కర్ నాయక్ పేర్కొంటున్నారు.తండాల్లో నివసించే ప్రజల అభివృద్ధి, పేద కుటుంబాల సంక్షేమం, యువతకు విద్యా ప్రోత్సాహం, సామాజిక ఐక్యత కోసం నిరంతరం కృషి చేయడమే తన లక్ష్యమని ఆయన చెబుతున్నారు. సేవాలాల్ మహారాజ్ బోధించిన "మానవ సేవే మాధవ సేవ" అనే భావనను జీవితంలో ఆచరిస్తూ, ప్రతి అవసరమైన కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.అదే సమయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలైన విద్య, సమాన అవకాశాలు, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందని భాస్కర్ నాయక్ అన్నారు. కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించే సమాజ నిర్మాణమే తన లక్ష్యమని పేర్కొన్నారు.గత కొంతకాలంగా పలు తండాల్లో తాగునీటి సమస్యల పరిష్కారం, దేవాలయాల నిర్మాణానికి ఆర్థిక సహాయం, పేదలకు వైద్య సహకారం, విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం వంటి సేవా కార్యక్రమాలను ఆయన చేపడుతున్నారు. ప్రజల కష్టాల్లో తోడుగా ఉండటమే నిజమైన నాయకత్వమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తనకు అతిపెద్ద బాధ్యతగా భావిస్తున్నట్లు చెప్పారు."సేవాలాల్ సేవా మార్గం నాకు సేవాస్ఫూర్తిని నేర్పితే, అంబేద్కర్ ఆశయాలు సమాజం కోసం బాధ్యతతో పనిచేసే దృక్పథాన్ని ఇచ్చాయి. ఈ ఇద్దరు మహనీయుల స్ఫూర్తితోనే నా ప్రజా ప్రయాణం కొనసాగుతోంది. ప్రజల ఆశీర్వాదమే నా బలం. సమాజ అభివృద్ధే నా ధ్యేయం" అని జర్పుల భాస్కర్ నాయక్ స్పష్టం చేశారు.సేవ, సమానత్వం, సామాజిక న్యాయం అనే మూడు సూత్రాలను ఆధారంగా చేసుకుని ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పునరుద్ఘాటించారు. సేవాలాల్ మహారాజ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ఆచరణలోకి తీసుకువస్తూ సమాజాభివృద్ధికి తన వంతు కృషిని నిరంతరం కొనసాగిస్తానని భాస్కర్ నాయక్ తెలిపారు.

# శిశువుకు తల్లిపాలే శ్రేష్ఠమైనవి

- బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలి
- డాక్టర్ సరిత పిలుపు
- గూడూరులో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**షాద్ నగర్, ఆగస్టు 05, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా గూడూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గర్భిణులు బాలింతలు తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో కీలకమని అన్నారు ఈ సందర్భంగా డాక్టర్ సరిత మాట్లాడుతూ బిడ్డ జన్మించిన వెంటనే తల్లిపాలు పట్టించడం ప్రతి తల్లి బాధ్యతగా భావించాలని సూచించారు బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని పిలుపునిచ్చారు ముర్రుపాలలో శిశువుకు వ్యాధి నిరోధక శక్తిని పెంచే పోషకాలు సమృద్ధిగా ఉంటాయని అవి బిడ్డకు సహజమైన రక్షణ కవచంలా పనిచేస్తాయని తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ఎం సుజాత,ఎస్ రజిని,ఆశా వర్కర్స్ ఎం మనీలా,జి కవిత,అంగన్వాడి ఆయా అనిత,గర్భిణీ స్త్రీలు బాలింతలు,తదితరులు పాల్గొన్నారు,

# బీరప్ప దేవాలయ స్థల వ్యవహారంలో న్యాయం చేస్తాం

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- సీఎస్కే వెంచర్‌లో వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే
- రాజకీయాలకు అతీతంగా పరిష్కారం చూపిస్తామని హామీ



**షాద్నగర్, ఆగస్టు 5 , నేటి శుభోదయ :** ఫరూఖ్‌నగర్ ప్రాంతంలోని సీఎస్కే విల్లాస్ వెంచర్‌లో పురాతన బీరప్ప స్వామి దేవాలయ స్థల వివాదం నేపథ్యంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంఘటన స్థలాన్ని బుధవారం పరిశీలించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో కలిసి పరిస్థితులను పరిశీలించి బాధితులతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, 10వ వార్డు కౌన్సిలర్ నడికూడ శ్రావణి, ఖదీర్, రాయికల్ శ్రీనివాస్, బాలరాజు గౌడ్, సాదిక్, చందు నాయక్, బీరప్ప, రవితేజ, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మాధవులు యాదవ్, లింగారెడ్డిగూడ ఉపసర్పంచ్ అశోక్, సీతారాం, మహేందర్, శేఖర్, గంగమోని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, ఇలాంటి సున్నితమైన అంశాల్లో అందరూ ప్రశాంతంగా వ్యవహరించాలని, వాస్తవ పరిస్థితులను పూర్తిగా తెలుసుకున్న తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సీఎస్కే వెంచర్ యజమానులతో స్వయంగా మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకుంటానని, బీరప్ప స్వామి దేవాలయానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అవసరమైతే ఇంటి స్థల యజమానులతో సమావేశం నిర్వహించి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ అంశాన్ని తాను రాజకీయ కోణంలో చూడనని, ఇతరులు కూడా రాజకీయాలకు వేదికగా మార్చకుండా ప్రజల విశ్వాసాలను గౌరవించాలని కోరారు. కౌన్సిలర్ శ్రావణి స్పందన స్థానిక కౌన్సిలర్ నడికూడ శ్రావణి మాట్లాడుతూ, వివాదాస్పద అంశాల్లో వాస్తవాలను పలుమార్లు పరిశీలించిన తర్వాతే నిర్ణయాలకు రావాలని అన్నారు. కొందరు ఇలాంటి పరిస్థితులను ఉపయోగించుకుని నిరాధార ఆరోపణలు చేయడం, మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించి శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అంతకుముందు ఈ సమస్యపై స్థానికులతో కలిసి ఆయన స్వగృహంలో వివాద వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు.

# వెంకటాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**తలకొండపల్లి ఆగస్టు 5, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బుజూరి పుష్పమ్మ అంజన్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త కమలమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది కమలమ్మ బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు.పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను, రోగనిరోధక శక్తి పెరుగుదలకు అవి ఎలా దోహదపడతాయో వివరించారు. ప్రతి తల్లి తమ బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు,చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య ను అందిస్తున్నాం

## -స్పెషల్ ఆఫీసర్ ఎండి ముజాహిద్దీన్.





**ఏన్కూరు, ఆగస్టు 5, నేటి శుభోదయ :**
ఏన్కూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మైనార్టీ సంక్షేమ, మండల ప్రత్యేక అధికారి ఎండీ.ముజాహిద్దీన్ సందర్శించారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి వాసవి దేవితో కలిసి పాఠశాల పరిసరాలను ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయిలో విద్యా కార్యక్రమాల పనితీరు, బడుల్లో విద్యార్థుల చేరికలు, జీరో ఎన్రోల్మెంట్, మధ్యాహ్న భోజన పథకం, పాఠ్యపుస్తకాల పంపిణీ, పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, తదితర అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలను పరిశీలించి. విద్యార్థులతో కలిసి భోజనం ఆయన చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి శ్రీధర్, ఉపాధ్యాయులు పుల్లయ్య, శంకర్రావు, కస్తూరి, విజయలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన సీఐ మహేష్



**మిడ్జిల్ , ఆగష్టు-05 , నేటి శుభోదయ :**
మిడ్జిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాల నివారణపై సీఐ మహేష్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ తెలియజేయవద్దని, అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలకు స్పందించవద్దని తెలిపారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో రాఘువేందర్ రెడ్డి, ఎస్సై శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు..

# పొంగులేటి తో నూతి



**ఖమ్మం, ఆగష్టు-05, నేటి శుభోదయ :**
జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి నివాసంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో జరిగిన సమావేశానికి హాజరైన ఉమ్మడి ఖమ్మం జిల్లా శాసనసభ సభ్యులతో కలిసి పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్బుధవారం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి నివాసంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో ఉమ్మడి జిల్లా శాసనసభ సభ్యులు మట్టా రాగమయిదయానంద్, మాలోత్ రాందాస్ నాయక్,కోరం కనకయ్య,జారే ఆదినారాయణ, పాయం వేంకటేశ్వరరావు లతో కలిసి పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ మూడు అంశాలపై చర్చించటం జరిగినదని రాబోవు పట్టభద్రుల ఎన్నికలపై అదేవిధంగా జిల్లా లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులను నియామకం గురించి, నామినేటెడ్ పదవులపై చర్చించటం జరిగినదని అన్నారు.

# కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు






**వైరా , ఆగస్టు 5, నేటి శుభోదయ :**
వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు జన్మదిన వేడుకలు ఘనంగా వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసారు .ఈ సందర్భంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై వీరంశెట్టి సీతారాములు కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, ఖమ్మం జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్ ఉండ్రు శ్యాంబాబు పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# సదాశివపేట రవీంద్ర నగర్ లోని నల్ల పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు



**సంగారెడ్డి , ఆగష్టు-05 , నేటి శుభోదయ :** నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి రావడం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ఆషాడ మాసం అమ్మవారికి బోనాలు సమర్పించినట్లయితే కోరిన కోరికలు తిరుతాయని, భక్తుల నమ్మకం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ గడిల రాంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరు, ఆశిరెడ్డి, శరత్ చంద్ర, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులుఎగమామిడి నాగరాజు, ఎగ మామిడి సురేష్, ఎగ మామిడి సునందరావు, పెద్దలోడి పాండు పెద్దలోడి బసంతి, పెద్దలోడి రవీందర్, తలారి శివ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్పల్లి టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం:- ఎర్ర యాకన్న







**కూకట్పల్లి, నేటి శుభోదయ :**
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం రోజు శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ ప్రాంతంలోని వడ్డేపల్లి కమలమ్మ భవనంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం, కూకట్పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ ఆగస్టు 5 నుండి ఆగస్టు 15 వరకు నమోదు కార్యక్రమం కొనసాగుతుందని తెలియజేశారు. కూకట్పల్లి నియోజకవర్గంలోని జర్నలిస్టులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారమే టి డబ్ల్యూ జె ఎఫ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి జర్నలిస్టు సభ్యత్వం తీసుకుని సంఘటిత శక్తిని పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకత్వంలో జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు అయ్యేవిధంగా చూస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం వద్ద బలంగా వాదించి సాధించే దిశగా సంఘం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి (జనరల్ సెక్రటరీ) నాగుల అంజిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగార్జున, మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండల్ రెడ్డి, కూకట్పల్లి కార్యవర్గ సభ్యులు సుజాత, నవీన్, సభ్యులు కోటేష్ ,శివ రామ్, పుట్టి నగేష్, ప్రహ్లాద్ కుమార్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

# సోలిపూర్ గ్రామంలో ఘనంగా బోనాల పండుగ

- **పోచమ్మ, మైసమ్మ దేవతలకు బోనాలురు సమర్పించిన మహిళలు**
- **5 వార్డు కౌన్సిలర్ సింగపాగ శిరీష అనిల్ కుమార్**

**షాద్నగర్ ,ఆగష్టు-05, నేటి శుభోదయ :** షాద్నగర్ మున్సిపాలిటీ 5వ వార్డు పరిధిలోని సోలిపూర్ గ్రామంలో బుధవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలోని అమ్మవార్ల దేవాలయాలను సర్వంగ సుందరంగా ముస్తాబు చేశారు. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు ఎత్తుకొని మంగళ హారతులు డప్పు వాయిద్యాల మధ్య యువకుల నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాలతో పోచమ్మ మైసమ్మ దేవాలయాలకు చేరుకొని బోనాలు సమర్పించి ముక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో 5 వార్డు కౌన్సిలర్ సింగపాగ శిరీష అనిల్ కుమార్, వెంకటేశ్వరరావు పంతులు, శివరాములు యాదవ్, గడ్డం కృష్ణయ్య, వెంకటేష్ గౌడ్, నరేందర్ గౌడ్, సతీష్ పి బాలరాజ్, బాబు నాయక్, నర్సింలు వెంకటేష్, కుమార్, అంజయ్య, కృష్ణయ్య, రమేష్ యాదవ్ బాలరాజ్, చీపిరి కృష్ణయ్య, కావలి కృష్ణయ్య యాదయ్య



శేఖర్. మరియు గ్రామ ముఖ్య నాయకులు పాల్గొని గ్రామస్తులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవార్ల చల్లని దీవెనలు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల అక్రమ రవాణా పై కఠిన చర్యలు

## - డీఎస్పీ అరుణ్ కుమార్

**ఖమ్మం, భద్రాచలం, ఆగస్టు 5 , నేటి శుభోదయ :** మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం పై కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ అన్నారు. బుధవారం భద్రాచలం పట్టణ ఎస్ఐ బి. రామకృష్ణ పోలీసు సిబ్బందితో కలిసి భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అతను వివేక్ విరాట్ నాగ్ @ వివేక్ నాగ్, తండ్రి సుక్రం నాగ్, నివాసం మహాపారా, కొర్ర, సుకుమా జిల్లా (ఛత్తీస్‌గఢ్) కు చెందినవాడిగా గుర్తించారు.విచారణలో, కలిమేల ప్రాంతానికి చెందిన నితీష్ కుమార్ అనే గంజాయి వ్యాపారి సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించేందుకు సుమారు 11 కిలోల గంజాయిని తీసుకుని భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చినట్లు నిందితుడు అంగీకరించాడు.నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.5,43,500/- విలువైన 11 కిలోల గంజాయి, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం భద్రాచలం పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగరాజు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ నిమిత్తం న్యాయస్థానానికి హాజరుపరిచారు.ఈ సందర్భంగా భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్



మాట్లాడుతూ, ఇటీవల యువత మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా వైపు ఆకర్షితులవుతున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం లేదా వాటికి సహకరించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# నడిగడ్డ తాండ సమస్యల పరిష్కారానికి ఉప కమిషనర్ కి వినతి పత్రం.

**మియాపూర్ ఆగస్టు 5, నేటి శుభోదయ :** నడిగడ్డ తాండ గిరిజన సంక్షేమ సంఘం కమిటీ ఆధ్వర్యంలో మాదాపూర్ సర్కిల్ - 50, ఉప కమిషనర్ బాల క్రిష్ణ ని కలిసి నడిగడ్డ తాండలో నెలకొన్న సమస్యల పరిష్కారం గురించి వినతి పత్రం అందజేయడం జరిగింది.ప్రస్తుతం మా తాండలో క్రింది సమస్యలు తీవ్రంగా ఉన్నాయి: వీధి దీపాలు ఉన్న విద్యుత్ దీపాలు సరిగా వెలగడం లేదు. అందువల్ల రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కావున నూతన విద్యుత్ దీపాలు మరియు నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయవలసి ఉన్నది. పారిశుధ్యం: తాండలోని ప్రధాన రోడ్లు మరియు పరిసర ప్రాంతాలు అంతా అశుభ్రంగా ఉన్నాయి. ప్రతిరోజు శుభ్రపరిచే శానిటేషన్ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదు. డ్రైనేజీ.. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల వర్షపు నీరు రోడ్లపై నిలుస్తుంది. దీనివల్ల మహిళలు, వృద్ధులు చాలా ఇబ్బంది పడుతున్నారు.. సి.సి. రోడ్లు: తాండలోని ప్రధాన




వీధుల్లో నూతన సి.సి. రోడ్లు ఏర్పాటు చేయవలసి ఉన్నది.మా వినతిని పరిగణలోకి తీసుకున్న ఉప కమిషనర్ సమస్యలను పరిష్కరించుటకు కృషి చేస్తానని సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో సభవత్ హన్మ నాయక్ అధ్యక్షులు, ఇస్లావత్ దశరథ్ నాయక్ ప్రధాన కార్యదర్శి, గోవిందు సుధాకర్, దేవనూర్ నర్సింహా★ తదితరులు పాల్గొన్నారు.

# అండమాన్-నికోబార్ ఐస్లాండ్ టీడీపీ పార్టీ అధ్యక్షుడు మాణిక్యరావుకు ఘన స్వాగతం..

- **జూబ్లీహిల్స్ నూతన సీఐ ముత్తు యాదవ్‌కు మర్యాదపూర్వక సన్మానం**

**జూబ్లీ హిల్స్ , ఆగష్టు-05 , నేటి శుభోదయ :** - అండమాన్–నికోబార్ ఐస్లాండ్ కేంద్రపాలిత ప్రాంతం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాణిక్యరావు హైదరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా ట్రూ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు జూబ్లీహిల్స్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మారమోని శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరిస్తూ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇటీవల జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన ముత్తు యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ప్రజలకు న్యాయబద్ధమైన, పారదర్శకమైన మరియు ప్రజా సేవకు అంకితమైన పోలీసింగ్ అందించాలని ఆకాంక్షిస్తూ, వారి పదవీకాలం విజ



యవంతంగా సాగాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవ, సామాజిక ఐక్యత మరియు పరస్పర సహకారంతో సమాజ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో భారత్ కిసాన్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డీకే చంద్రశేఖర్ యాదవ్, గురుస్వామి, లక్ష్మణ్, రమణ, వంశీ, తదితర ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# హరీశ్ రావుపై బురదజల్లడం మాని హామీలు నెరవేర్చండి

## – సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్




**షాద్నగర్ , ఆగష్టు 05, నేటి శుభోదయ :** హరీశ్ రావు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేక, ఆయన లేవనెత్తిన ప్రజా సమస్యలను పరిష్కరించే దమ్ము లేక కాంగ్రెస్ పార్టీ క్షుద్ర రాజకీయాలకు తెరలేపిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు హిందూ సంస్కృతిని అగౌరవపరుస్తూ, పవిత్ర ఆలయాల ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని, అర్చకుల వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ, సనాతన ధర్మం మరియు ధార్మిక కార్యక్రమాలపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. మీకు చేతనైతే హరీశ్ రావు అడిగినట్లుగా గోదావరి జలాలను రైతుల పంట పొలాలకు తరలించండి. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయండి. పెంచుతామని హామీ ఇచ్చిన పెన్షన్లను పెంచండి. నిరుద్యోగ భృతిని అందించండి. ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించండి. ఇవన్నీ చేయలేక ప్రశ్నించే హరీశ్ రావు పై బురదజల్లడం ద్వారా ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. హరీశ్ రావు పై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజల ముందు ఉంచాలని, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గుడులకు వెళ్లడం, పూజలు చేయడం తప్పు అన్నట్లుగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. క్షుద్ర పూజల చరిత్ర కాంగ్రెస్ పార్టీకేనని, గతంలో వివాదాస్పద తాంత్రికుడు చంద్రస్వామితో పూజలు చేయించి సీబీఐ విచారణను ఎదుర్కొన్నది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. వర్షాల కోసం యాగాలు, యజ్ఞాలు నిర్వహించిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైనది ప్రశ్నలకు సమాధానాలు, సమస్యలకు పరిష్కారాలేనని, నీచ రాజకీయాలు కాదన్నారు. గోదావరి నీళ్లు ఎత్తిపోతలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. దేవుళ్లపై ప్రమాణాలు చేసి ప్రజలకు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ నాయకులదేనని ఆరోపించారు. చేయాల్సిన పనులు వదిలిపెట్టి ఇప్పుడు గుళ్లు, పూజలు, అర్చకులపై వ్యాఖ్యలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు భక్తిని, విశ్వాసాన్ని రాజకీయాలకు వాడుకోవద్దని సూచించారు. వర్షాలు కురవకపోతే హరీశ్ రావు తప్పు, రుణమాఫీ అమలు కాకపోతే హరీశ్ రావు తప్పు, కరెంట్ కోతలు వచ్చినా హరీశ్ రావు తప్పు అంటున్నారు. మరి రాష్ట్రంలో ప్రభుత్వం ఎవరిది? అధికారంలో ఉన్న వారు తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని అన్నారు. హరీశ్ రావు గారిపై ఇన్ని ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు వాటికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుంచాలని, లేకపోతే వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేవుళ్లపై ప్రమాణం చేసి గుడుల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇప్పుడు ఆలయాలు, పూజలు, అర్చకులపైనే విమర్శలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620